www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 180 | ఆదివారం 23.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి బలం

## హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టండి..

- విద్య, పరిశోధనలో కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యానికి చర్చలు
- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్‌కు కేంబ్రిడ్జ్ సహకారం
- ఇంపీరియల్ కాలేజీతో విద్యా భాగస్వామ్యంపై చర్చలు
- హైదరాబాద్‌లో సంయుక్త పరిశోధనలకు ప్రణాళిక
- గ్లోబల్ వర్సిటీలకు హైదరాబాద్ ఆహ్వానం
- యువ పారిశ్రామికవేత్తలకు కేంబ్రిడ్జ్ అండ
- అంతర్జాతీయ విద్యా కేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణలో షార్ట్‌టర్మ్ కోర్సులకు ఇంపీరియల్ ఆసక్తి
- విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడిపై చర్చలు
- తెలంగాణలో పెట్టుబడులకు లివర్‌పూల్ ఆసక్తి
- క్రీడలు, టెక్నాలజీ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం

03

### యువ పారిశ్రామికవేత్తలకు కేంబ్రిడ్జ్ అండ

### తెలంగాణలో పెట్టుబడులకు లివర్‌పూల్ ఆసక్తి



### లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడల్లో లివర్‌పూల్‌తో భాగస్వామ్యం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఇవాళ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం కోరారు. స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాల నిర్ణయం తీసుకున్నాయి.

**తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి:**

ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట గారు, 'ఫ్రూగల్ ఏఐ' కో–చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించారు.





## పత్రికా స్వేచ్ఛే

### విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలి

# ప్రజాస్వామ్యానికి కీలకం

### జర్నలిస్టుల ఆస్తి విశ్వసనీయతే

- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్‌ను ప్రారంభించిన భట్టి
- పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి కీలకం
- ప్రభుత్వాలు విమర్శలను స్వీకరించాలి
- జిల్లా రిపోర్టర్లే ప్రభుత్వానికి ఎర్లీ వార్నింగ్
- అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించండి
- జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మీడియా వృత్తి ప్రమాణాలను కాపాడుకోవాలి

02

### జిల్లా రిపోర్టర్లే ప్రభుత్వానికి ఎర్లీ వార్నింగ్ సిస్టమ్

దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీయ జర్నలిజం చరిత్ర, జాతీయోద్యమంలో పత్రికల పాత్ర, ప్రస్తుత మీడియా సవాళ్లు, డిజిటల్ యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ తదితర అంశాలపై డిప్యూటీ సీఎం ప్రసంగించారు.

# పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్




- ఇందిరమ్మ ఇండ్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక: పొంగులేటి
- ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం
- నిజామాబాద్‌లో ఇందిరమ్మ మోడల్ టవర్స్‌కు శ్రీకారం
- ఇందిరమ్మ టవర్స్‌ను ఇతర పట్టణాలకు విస్తరిస్తాం
- అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తాం
- అర్హులకు ఇళ్ల మంజూరుపై అధికారులకు ఆదేశాలు

03

## ఏఐ వల్ల సైబర్ నేరాలు పెరిగే ముప్పు

- ఏఐతో సైబర్ నేరాల ముప్పు పెరుగుతోంది
- నేరాల విచారణలో ఏఐతో కొత్త సవాళ్లు
- టెక్నాలజీకి అనుగుణంగా న్యాయ విద్యలో మార్పులు
- ఏఐతో డేటా మార్పిడి వేగవంతం

02



## తేజస్ ఎమ్‌కే-2 అస్సలు పనికిరాదు..

- 2035లో తేజస్ ఎంకే-2తో ఉపయోగం ఉండదు: నాగేశ్ కపూర్
- చైనా, పాక్ దూసుకెళ్తుంటే భారత్ వెనుకబడుతోంది
- యుద్ధ విమానాల సాంకేతికతలో భారీ వ్యత్యాసం

02



## 30 శాతం కమీషన్ల కోసమే

### బోడుప్పల్‌లో 1,500 కుటుంబాలకు 22ఏ షాక్

- బోడుప్పల్ భూములపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు
- 22ఏ నిషేధిత జాబితాపై బీఆర్ఎస్ ఆగ్రహం
- దశాబ్దాలుగా ఉంటున్న ఇళ్లపై 22ఏ నిబంధనా?
- ప్రజల ఆస్తులను కబ్జా చేసే హక్కు ఎవరిచ్చారు?

05



## తెలంగాణలో కొత్త టెలికాం పాలసీ..

### ఎలాంటి ఫీజులు వసూలు చేయవద్దు

- డిజిటల్ మౌలిక వసతులకు తెలంగాణ సర్కార్ బూస్ట్
- ఫైబర్ కేబుళ్లు, టవర్లకు ఆన్‌లైన్ అనుమతులు
- భారత్‌నెట్ ప్రాజెక్టులకు ఫీజుల మినహాయింపు
- టెలికాం పనులకు ఇక వేగంగా అనుమతులు
- కేబుళ్ల రక్షణకు 'కాల్ బిఫోర్ యూ డిగ్'
- టెలికాం మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యం

02

### టెలికాం కేబుళ్లకు నష్టం చేస్తే కఠిన చర్యలు






## సుందరంగా సున్నం చెరువు..

### మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలకు హైడ్రా చెక్

### 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా చర్యలు

- మురుగు కూపం నుంచి సుందర చెరువుగా సున్నం చెరువు
- సున్నం చెరువు చుట్టూ కొత్త అందాలు
- చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణానికి చర్యలు
- సున్నం చెరువుకు పర్యాటక శోభ తీసుకొస్తున్న హైడ్రా

05



## ఏఐ వల్ల సైబర్ నేరాలు పెరిగే ముప్పు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరిగేకొద్దీ సైబర్ నేరాలు మరింత విస్తరించే ప్రమాదం ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'సమకాలీన చట్టపరమైన, నియంత్రణ సమస్యలు' అనే అంశంపై జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏఐ వల్ల డేటా ట్రాన్స్‌ఫార్మేషన్ వేగంగా జరుగుతోందని, నేరాల విచారణలో కొత్త కొత్త సవాళ్లు ఎదురువుతున్నాయని తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా న్యాయ విద్య కూడా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శామ్ కోశి కూడా పాల్గొన్నారు.

## బీసీల పట్ల వివక్షత చూపుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతాం



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** బీసీల పట్ల వివక్షత చూపుతూ బీసీ కులగనున ఆశాస్త్రీయంగా, అస్పష్టతగా కుల గణన చేసి చేతులు దులుపుకున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 90 శాతం జనాభా ఉన్న బీసీ జాతికి దక్కాల్సిన వాటా దక్కకుండా ప్రధానమంత్రి మోదీ బీసీలను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు, సెప్టెంబర్ 20న దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ప్రతినిధులను రాష్ట్రానికి ఆహ్వానించి ప్లీనరీ నిర్వహించి నవంబర్ లో లక్ష మందితో పార్లమెంటు ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు నానచర్ల రమేష్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వరికుప్పల మధు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్, యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నరేష్ ప్రజాపతి, గూడూరు భాస్కర్ అనంతుల సాయి, పబ్బు స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కొత్త టెలికాం పాలసీ..

### ఆ యాప్‌లో సమాచారం ఇవ్వకుంటే కేసే!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన టెలికమ్యూనికేషన్స్ యాక్ట్-2023, రైట్ ఆఫ్ వే రూల్స్--2024లకు అనుగుణంగా కొత్త నిబంధనలను అమలు చేయనుంది. ఈ మేరకు పాత జీవోను రద్దు చేస్తూ నూతన ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రోడ్లు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో ఫైబర్ కేబుళ్లు, టవర్ల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, సమాచార మార్పిడి మొత్తం కేంద్ర ప్రభుత్వ 'టెలికాం ఈ-సర్వీసెస్ పోర్టల్' ద్వారానే ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకోసం 30 రోజుల్లోగా ప్రభుత్వ విభాగాలు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎలాంటి ఫీజులు వసూలు చేయవద్దు:**

నూతన విధానంలో భారత్‌నెట్‌తో పాటు ప్రాధాన్యత కలిగిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. ప్రభుత్వ ఆస్తులపై టెలికాం మౌలిక వసతుల ఏర్పాటుకు ఎలాంటి ఫీజులు, అద్దెలు, ఛార్జీలు లేదా బ్యాంకు గ్యారంటీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. అంతేకాకుండా, టెలికాం నెట్‌వర్క్‌ను స్థిరాస్తిలో భాగంగా పరిగణించకూడదని, వాటిపై స్థానిక సంస్థలు ఆస్తిపన్ను, సెస్‌లు విధించడానికి వీల్లేదని ఆదేశించింది. ప్రాధాన్యత కలిగిన టెలికాం ప్రాజెక్టులకు విద్యుత్ డిస్కమ్‌లు కూడా 'ప్రభుత్వ కనెక్షన్లు'గా భావించి వేగంగా కనెక్షన్లు మంజూరు చేయాల్సి ఉంటుంది.

**తవ్వకాలకు ముందు 'కాల్ బిఫోర్ యూ డిగ్' తప్పనిసరి:**

మరోవైపు రహదారులు, ఇతర ప్రభుత్వ ప్రాంతాల్లో తవ్వకాలు చేపడితే 'కాల్ బిఫోర్ యూ డిగ్ ' మొబైల్ యాప్‌లో ముందస్తు సమాచారం అందించడం తప్పనిసరి చేశారు. తవ్వకాల వల్ల టెలికాం కేబుళ్లు లేదా మౌలిక వసతులకు నష్టం కలిగిస్తే దానిని కాగ్నిజబుల్, నాన్-బెయిలబుల్ నేరంగా పరిగణిస్తారు. అలా నష్టం కలిగించిన వారికి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 2 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశముందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మార్చి 31, 2026 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సెప్టెంబర్ 30, 2026 నాటికి పరిష్కరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది.

**మూడు నెలలకోసారి సమీక్ష:**

రాష్ట్రంలో టెలికమ్యూనికేషన్స్ యాక్ట్, రైట్ ఆఫ్ వే నిబంధనల అమలును ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ పర్యవేక్షించనుంది. జిల్లా కలెక్టర్లు ప్రతి నెల నిర్వహించే జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశాల్లో పురోగతిని సమీక్షించనుంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఉన్న స్టేట్ బ్రాడ్‌బ్యాండ్ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి టెలికాం మౌలిక వసతుల పురోగతిని సమీక్షించనుంది. అలాగే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ సంస్థలు 30 రోజుల్లోగా అంతర్గత అనుసరణ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన త్రాగునీటి(డ్రింకింగ్ వాటర్ ప్యూరిఫైడ్ ) ప్లాంట్‌ను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం ప్రారంభించారు. ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విద్యార్థులతో కలిసి శుద్ధి చేసిన త్రాగునీటిని తాగి, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు స్వచ్ఛమైన త్రాగునీరు,పోషకాహారం,ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు.విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దాతల సహకారంతో పాఠశాలలో శుద్ధి చేసిన త్రాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని,అదే సమయంలో దాతలు,ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌరు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,దాతలు, ప్రజాప్రతినిధులు,అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# తేజస్ ఎమ్‌కే-2 అస్సలు పనికిరాదు..



**న్యూ ఢిల్లీ :** స్వదేశీ యుద్ధ విమానాల తయారీ విషయంలో భారత్ అనుసరిస్తున్న వ్యూహంపై మాజీ ఎయిర్ ఫోర్స్ వైస్ చీఫ్, ఎయిర్ మార్షల్ నాగేశ్ కపూర్ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ముఖ్యంగా భారత వైమానిక దళం సొంతంగా డెవలప్ చేస్తున్న 'తేజస్ ఎమ్‌కే-2' యుద్ధ విమానాల ప్రాజెక్టుపై ఆయన హాట్ కామెంట్స్ చేశారు. 2030ల మధ్య తేజస్ ఎమ్‌కే-2 పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే సమయానికి యుద్ధ రంగంలో అవి ఎంతమాత్రం ఆపరేషనల్‌గా ఉపయోగపడదని ఆయన తేల్చి చెప్పారు. భారత వైమానిక దళ వైస్ చీఫ్‌గా పదవీ విరమణ పొందిన కొద్ది వారాలకే ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు దేశ రక్షణ రంగంలో సంచలనంగా మారాయి.

**చైనా, పాక్ అలా భారత్ ఇలా..**

తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన.. చైనా ఇప్పటికే ఆరో తరం యుద్ధ విమానాల దిశగా ముందుకు వెళ్తుంటే, పాకిస్థాన్ ఐదో తరం యుద్ధ విమానాలను పరిశీలిస్తోందని ఇటువంటి నేపథ్యంలో.. 2035లో భారత్ నాలుగో తరం యుద్ధ విమానంతో కొనసాగడం సమంజసమేనా అని ప్రశ్నించగా దీనికి స్పందించిన నాగేశ్ కపూర్.. ఖచ్చితంగా సరికాదన్నారు. ఆపరేషనల్ పరంగా ఇది ఉపయోగపడదని ఆయన స్పష్టం చేశారు.

**సాంకేతికతలో భారీ వ్యత్యాసం:**

అమెరికా ఎఫ్-22, చైనా జే-20 వంటి ఐదో తరం యుద్ధ విమానాల్లో స్టెల్త్ టెక్నాలజీ, సెన్సార్ ఫ్యూజన్, ఆయుధాలను విమానం లోపలే మోసుకెళ్లే సామర్థ్యం ఉంటాయి. రాడార్‌కు చిక్కకుండా పనిచేసే సామర్థ్యం వీటి ప్రధాన బలం. చైనా అభివృద్ధి చేస్తున్న జే-36, జే-50 వంటి ఆరో తరం యుద్ధ విమానాలు స్టెల్త్ సామర్థ్యానికి తోడు కృత్రిమ మేధ (AI) ఆధారిత స్వయంప్రతిపత్తి, డ్రోన్ వింగ్‌మెన్, 'సిస్టమ్ ఆఫ్ సిస్టమ్స్' వంటి అధునాతన సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నాయని అంటే యుద్ధ విమానం కేవలం ఒక ప్లాట్‌ఫామ్‌గా కాకుండా మొత్తం నెట్‌వర్క్‌లో కీలక కేంద్రంగా పనిచేసే విధంగా అభివృద్ధి చేస్తున్నారని నాగేశ్ చెప్పారు. అయితే ప్రస్తుతం భారత్ వద్ద ఐదో లేదా ఆరో తరం యుద్ధ విమానాలు లేవని మరోవైపు 2030 నాటికి చైనా వద్ద దాదాపు 500 జే-20 ఐదో తరం యుద్ధ విమానాలు సేవల్లోకి వచ్చే అవకాశం ఉందని కొన్ని అంచనాలు పేర్కొంటున్నాయని వెల్లడించారు.

**తేజస్ ఎమ్‌కే-2 కు ప్రాధాన్యత లేదని చెప్పడం లేదు:**

తేజస్ ఎమ్‌కే-2 తరహా నాలుగో తరం యుద్ధ విమానాలకు పూర్తిగా ప్రాధాన్యం లేదని తాను చెప్పడం లేదని నాగేశ్ కపూర్ స్పష్టం చేశారు. ఐదో, ఆరో తరం యుద్ధ విమానాలను నిర్దిష్ట సంఖ్యలో మాత్రమే మోహరించగలమని దేశం విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకుంటే వాటిని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంచడం సాధ్యం కాదన్నారు. అందువల్ల మిగిలే ఖాళీలను తేజస్ ఎంకే-2 తరహా యుద్ధ విమానాలతో భర్తీ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**హెచ్‌ఏఎల్‌పై తీవ్ర అసంతృప్తి:**

తేజస్ విమానాలను తయారు చేస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ధోరణిపై ఎయిర్ మార్షల్ కపూర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా తేజస్ ఎమ్‌కే-1A విమానాలు ఇప్పటికీ గణనీయమైన సంఖ్యలో వైమానిక దళానికి అందకపోవడం భారీ ఆందోళన కలిగించే అంశం అని అన్నారు. చాలా ఏళ్ల క్రితమే నిర్దిష్ట సామర్థ్యాలతో ఒక యంత్రాన్ని అందిస్తామని హామీ ఇచ్చినప్పుడు.. ఏదో ఒక కారణంతో అది ఇప్పటికీ ఎందుకు అందడం లేదు? అని ప్రశ్నించారు. ఎక్కడో ఎవరో తమ హామీలను నిలబెట్టుకోలేకపోతే.. దాని వల్ల మనం ఎందుకు ఇబ్బందులు పడాలి? అని వ్యాఖ్యానించారు. స్వదేశీ యుద్ధ విమానాల అవసరాన్ని బలంగా సమర్థిస్తూనే.. స్వదేశీ మార్గంలోనే ముందుకు వెళ్లాలి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఎంతకాలం ఎదురుచూస్తూ ఉండాలి? అని ప్రశ్నించారు. భారత్ యూరప్‌కు చెందిన అధునాతన ఆరో తరం యుద్ధ విమానాల కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని నాగేశ్ కపూర్ సూచించారు.

# పత్రికా స్వేచ్ఛే ప్రజాస్వామ్యానికి కీలకం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీయ జర్నలిజం చరిత్ర, జాతీయోద్యమంలో పత్రికల పాత్ర, ప్రస్తుత మీడియా సవాళ్లు, డిజిటల్ యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ తదితర అంశాలపై డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమన్నారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని స్పష్టం చేశారు. వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదేనని, సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందన్నారు.ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత కొందరు 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ప్రశ్నించారు. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.జాతీయోద్యమంలో పత్రికలది చెరగని ముద్ర ఉందని గుర్తు చేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదు, పౌరులను,సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడమన్నారు. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా మహాత్మా గాంధీ, మూక్ నాయక్, బహిష్కృత భారత్ ద్వారా బాబాసాహెబ్ అంబేద్కర్, కేసరి, మరాఠా ద్వారా లోకమాన్య బాలగంగాధర్ తిలక్, అలాగే దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారు పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలిచారని కొనియాడారు. అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయన్నారు. 1948లో శంకర్స్ వీక్లీలో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను గుర్తు చేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ, ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు వ్యాపిస్తున్న ఈ కాలంలో జర్నలిస్టులకు అసలైన ఆస్తి విశ్వసనీయతేనని ఉద్ఘాటించారు. ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత అని అన్నారు.కొత్తగా ఏర్పాటైన ఫెడరేషన్ కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ, జిల్లా స్థాయిలో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో టీచర్ లేకపోయినా, ఆసుపత్రిలో డాక్టర్ లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా రిపోర్టర్ల ద్వారానేనని, వారే ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అని కొనియాడారు. జర్నలిజాన్ని రక్షించాలంటే జర్నలిస్టులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందని, వారి భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.తెలంగాణ గడ్డపై మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భరోసా ఇచ్చారు. "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని అన్నారు."అధికారంలో ఉన్నవారిని వదలకండి.. అదే సమయంలో మీ వృత్తి ప్రమాణాలను కూడా వదలకండి. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి. మిమ్మల్ని మీరు మీ ప్రమాణాలకు జవాబుదారీగా ఉంచుకోండి. ఈ రెండింటి ప్రయోజనం చివరికి పౌరుడికే దక్కాలి" అని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. ఫెడరేషన్ విజయవంతంగా ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ది హిందూ మాజీ ఎడిటర్ ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ నుంచి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్ల కాకులు, మేక పిల్లలు మాట్లాడుతున్నాయి..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రచ్చ రేపుతున్నాయి. కొండా సుస్మిత వ్యాఖ్యలపై పలువురు కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో రియాక్ట్ అవుతుండగా తాజాగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సుస్మితకు కౌంటర్ ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన ఆయన.. కొన్ని పిల్లకాకులు, మేక పిల్లలు ఏదో మాట్లాడుతున్నాయని, వారి మాటలను వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానన్నారు. తాజాగా పరకాల నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన రేవూరి.. నా ప్రజాదరణ చూసి స్టేజీమీదే మరోసారి టికెట్ ఖరారు చేశారన్నారు. నేను ముసలోడినని కర్ర పట్టుకుని నడుస్తున్నానంటూ మాట్లాడుతున్నారు. కానీ నా ఉత్సాహం ఏంటో నా అభివృద్ధి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. ప్రజలు ఇచ్చిన ధైర్యంతో హుషారుగా నియోజకవర్గంలో సేవా చేస్తుంటే కొంత మంది విచిత్రంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్

## రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్: మంత్రి పొంగులేటి

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలందరికి ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇవాళ నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రి ఇవాళ ఉదయం హౌసింగ్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కార్పోరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న, ఇప్పటికే పూర్తయిన, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్దిదారుల మనోగతాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

మంత్రి మాట్లాడుతూ..లబ్ధిదారులతో మాట్లాడినప్పుడు, సొంతింటి కల నెరవేరిందనే ఆనందం వారి కళ్లలో కనిపించింది. ఈ ప్రభుత్వానికి ఆశీర్వాదాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ వారు చెప్పిన మాటలు నాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించాయి. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడినప్పుడల్లా పేదింటి చిరకాల కలను తీర్చే బాధ్యత దొరకడం అనేది నా అదృష్టంగా భావిస్తుంటా నన్న మంత్రి.. ఈ సందర్భంగా లబ్దిదారులకు కానుకలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఇతర పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్:**

హైదరాబాద్ తరహాలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ను రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడ నిర్మించేలా నిజామాబాద్ నుండి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి చెప్పారు. నిజామాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టు కోసం నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్‌లో ఇచ్చే మొదటి విడత ఇండ్లతో కలిసి 8 లక్షల ఇండ్లు మంజూరు చేశాం, 2 లక్షల ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడ పూర్తయ్యాయన్నారు. అక్కడనుండి నిజామాబాద్ పట్టణంలో గత ప్రభుత్వాలు నిర్మించదలచి, అరకొరగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలించి, నివాసయోగ్యానికి కావాల్సిన నిర్మాణాలు, వసతులను వెంటనే పూర్తిచేసి, అర్హులైన లబ్దిదారులకు ఎంపిక చేసి ఇండ్లను మంజూరు చేసి, అందించాలని జిల్లా కలెక్టరు, అధికారులను ఆదేశించారు.



# ఆ బిల్డింగ్‌లన్నీ నేలమట్టం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంజయ్య నగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగిస్తామని, ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన రంగనాథ్.. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు మరణించారని, ఈ భవనాన్ని నాలా పక్కనే కట్టినట్లు తెలుస్తోందన్నారు. ఈ చుట్టుపక్కల అన్ని బిల్డింగులు 40-50 గజాల్లోనే ఐదారు అంతస్తులు నిర్మించించారని వీటిలో ఎక్కువ శాతం హాస్టల్స్ నిర్వహిస్తున్నారని చెప్పారు. నాలాను ఆక్రమించి ఇష్టానుసారంగా ఇక్కడ భవనాలు కట్టారని, ఈ నేపథ్యంలో అంజయ్య నగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలన్నింటినీ కూల్చివేస్తామని ఇక్కడ బిల్డింగులను వెంటనే ఖాళీ చేయాలని ప్రజలను కోరంతున్నామన్నారు.

**సాజిద్ సామ్రాజం!:**

షాజీద్ అనే వ్యక్తి ఇలాంటి బిల్డింగులు నిర్మించి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని రంగనాథ్ చెప్పారు. బిల్డర్ సాజిద్ కట్టే భవనాలన్నీ ఇలాగే ఉన్నాయని చెబుతున్నారు. అతడి బిల్డింగులు అన్నింటిని పరిశీలించి కార్పొరేషన్ అధికారులతో కలిసి చర్యలు తీసుకోబోతున్నామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన.. కూలిపోయిన బిల్డింగ్‌పై తమకు ఫిర్యాదు రావడంతో ఈ భవనాన్ని గతంలోనే సీజ్ చేసినట్లు చెప్పారు. తాము సీజ్ చేయడంతో నాలుగు నెలలు పనులు ఆపేసిన యజమాని మళ్లీ నిన్న పనులు మొదలు పెట్టినట్లు తెలుస్తోందని ఇంతలో ఈ విషాదం జరిగిందన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న -- పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా అక్కన్నపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి అవసరమని, అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికతో ముందుకెళ్తోందని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికి, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ సామర్థ్యాన్ని చాటడానికి ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేపట్టాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం బాధాకరమని, ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రావాల్సిన మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్డు, నిధులు, ప్రాజెక్టులను తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. "రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం బీజేపీ నేతలకు లేదా ?" అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు తమ ఐక్యతను కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో చూపించాలని హితవు పలికారు.

**ఇంటింటికీ సంక్షేమం - క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం..**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 183 గ్రామాల్లో ప్రజాసమస్యలను నేరుగా తెలుసుకొని, అక్కడికక్కడే పరిష్కరించేందుకే 'పల్లె పల్లెకు ప్రజా పాలన' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ప్రతిరోజూ 5 నుంచి 6 గ్రామాల్లో పర్యటిస్తూ వ్యవసాయం, ఉపాధి, విద్యుత్, రోడ్లు, తాగునీరు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని, అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

# తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి బలం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఇవాళ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం కోరారు. స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాల నిర్ణయం తీసుకున్నాయి.

**తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి:**

ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగసాౠములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట గారు, 'ఫ్రూగల్ ఏఐ' కో-చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి.

**తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి బలం:**

ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూర్చనుంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. లండన్‌లో పలువురు ప్రతినిధులతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ మేరకు తెలంగాణ అభివృద్ధిపై చర్చిస్తున్నారు. ఈరోజు (శనివారం) లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి లివర్‌పూల్ ప్రతినిధులు ఆసక్తి చూపిస్తున్నారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, క్రియేటివ్ ఎకానమీపై భాగస్వామ్యం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు లివర్‌పూల్ ప్రతినిధుల బృందం అక్టోబర్‌లో రానుంది. హైదరాబాద్ పర్యటనలో లివర్‌పూల్ భాగస్వామ్యంపై అధికారిక ఒప్పందానికి సన్నాహాలు చేస్తున్నారు.

**లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు: సీఎం సలహాదారు రామకృష్ణారావు**

లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు జరిగాయని సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు తెలిపారు. ఇంపీరియల్ కాలేజీని సందర్శించామని అన్నారు. ఆ కాలేజీ ప్రతినిధులతో విద్యా సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించామని వెల్లడించారు. తెలంగాణలో షార్ట్‌టర్మ్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులపై పరిశీలిస్తున్నామని అన్నారు. పరిశోధన, విద్యార్థులు - అధ్యాపకుల మార్పిడిపై ఇంపీరియల్ ఆసక్తి చూపిస్తోందని వివరించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఇంపీరియల్ ప్రతినిధులకు ఆహ్వానించామని రామకృష్ణారావు చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరుగుతుందని తెలిపారు. STEM, బిజినెస్ విద్యలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా ఇంపీరియల్ కాలేజ్‌కి పేరొందని వెల్లడించారు. అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తెలంగాణ అభివృద్ధికి భాగస్వామ్య చర్చలు జరిగాయని వివరించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కార్యక్రమాలకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నట్లు రామకృష్ణారావు పేర్కొన్నారు.

# ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం..

- ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం.. అమీన్పూర్‌ను అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- రూ.8.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
- కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్
- మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్ / సంగారెడ్డి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కాలనీల్లో నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాము, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. శనివారం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని రాజేంద్ర రెడ్డి కాలనీ, సాయి అంబిక కాలనీ, పిఎన్ఆర్ కాలనీ, నరేంద్ర నగర్ కాలనీ, సాయిరామ్ ఎంక్లేవ్, శంకర్ గ్రీన్ హోమ్స్, బృందావన్ టీచర్స్ కాలనీ, నవ్య నందనవనం కాలనీ, నర్రేగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీలలో పర్యటించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. మొత్తం రూ. 8.19 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్యే నేరుగా సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అమీన్పూర్ పరిధిలో దశాబ్దాలుగా కొనసాగుతున్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఇప్పటికే అనేక ప్రాంతాలకు తాగునీటి సరఫరా అందిస్తున్నామని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు సైతం తాగునీటిని అందించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

**ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు**

కాలనీల్లోని ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన మేరకు అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులు**

అమీన్పూర్‌లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల కారణంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం**

ప్రాంత అభివృద్ధిలో ప్రజలు కూడా భాగసాౠములు కావాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలు పర్యవేక్షిస్తూ, వాటి నాణ్యతపై సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేస్తూ, అవసరమైన చోట నిధులు సమకూర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అమీన్పూర్‌లో అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రతి కాలనీలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, డిఈ వెంకటరమణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, గోపాల్, మల్లేష్, కృష్ణ, రాములు, బిజిలి రాజు, జగదీష్, బాలరాజు, చంద్రశేఖర్, యూసుఫ్, మల్లేష్, బాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి

**అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి**
**అధికారుల్లో జవాబుదారీతనం కొరవడితే సహించేది లేదు**
**రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారుల తీరుపై అసహనం**



**కొల్లాపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలనే లక్ష్యంతో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వరుసగా మూడో రోజు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి.. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే, మరోవైపు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**స్టేడియాల నిర్మాణానికి కసరత్తు**

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం పెంట్లవెల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో స్టేడియాల నిర్మాణానికి కసరత్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**మ్యూటేషన్లకు ఏళ్ల తరబడి తిప్పించుకోవడమేంటి?**

అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించగా.. ఆయన ఓపికగా విని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మ్యూటేషన్ల కోసం దీర్ఘకాలంగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై మంత్రి జూపల్లి తీవ్రంగా స్పందించారు. ఏళ్ల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తే సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని మంత్రి తెలిపారు.

## సంపాదకీయం



# క్రమశిక్షణ పేరుతో కాంగ్రెస్‌లో

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీ అంతర్గత సంక్షోభంగా మారాయి. ఈ వ్యవహారంపై సురేఖకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరడం, అనంతరం పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం చూస్తే ఇది కేవలం వ్యక్తిగత వ్యాఖ్యల వివాదంగా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

**కుమార్తె వ్యాఖ్యలు.. తల్లికి రాజకీయ బాధ్యత?**

సురేఖ తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవని, వాటితో తనకు లేదా కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఇచ్చిన వివరణలో ఇదే విషయాన్ని పేర్కొన్నారు. ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతుంది. ఒక ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు అధికార పార్టీ ముఖ్య నేతపై బహిరంగంగా విమర్శలు చేసినంత మాత్రాన ఆ కుటుంబంలోని మంత్రిని నేరుగా బాధ్యురాలిగా చేయడం ఎంతవరకు సమంజసం? అదే సమయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యుల రాజకీయ వ్యాఖ్యలు అధికార పార్టీకి ఇబ్బంది కలిగించే స్థాయికి చేరితే, వాటి ప్రభావాన్ని పూర్తిగా విస్మరించగలమా? ఈ రెండు ప్రశ్నలకు కాంగ్రెస్ నాయకత్వం సమతుల్యమైన సమాధానం చెప్పాల్సి ఉంది.

**వివాదం వెనుక అసలు కారణం పరకాలేనా?**

ఈ వ్యవహారాన్ని కేవలం సుస్మిత వ్యాఖ్యలతోనే అర్థం చేసుకోవడం రాజకీయంగా అసంపూర్ణం. అసలు నేపథ్యం పరకాల నియోజకవర్గ రాజకీయాలేనన్న అభిప్రాయాలు బలపడుతున్నాయి. రేవంత్‌రెడ్డి ఇటీవల పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మద్దతు ప్రకటించడం, అదే సమయంలో కొండా కుటుంబం నుంచి పరకాలపై రాజకీయ ఆసక్తి వ్యక్తమవడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. అంటే ఇది కేవలం "కుమార్తె ఏమన్నారు?" అనే ప్రశ్న కాదు. "పరకాలలో కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ సమీకరణం ఎలా ఉండాలి?" అన్న ప్రశ్న కూడా ఇందులో దాగి ఉంది. పార్టీలో టికెట్ ఆశలు, స్థానిక ఆధిపత్యం, వర్గ రాజకీయాలు కలిసినప్పుడు చిన్న వ్యాఖ్య కూడా పెద్ద రాజకీయ సంక్షోభంగా మారుతుంది. ప్రస్తుతం అదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

**20 మంది నేతల బహిరంగ నిరసన.. అధిష్ఠానానికి సంకేతం**

ఆగస్టు 21న పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బహిరంగంగా కఠిన చర్యలు కోరడం ఈ వ్యవహారంలో కీలక పరిణామం. దాదాపు 20 మంది నేతలు ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలను తప్పుబట్టి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ౹ా× నివేదించింది. ఇంతమంది అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఒకే అంశంపై బహిరంగంగా మాట్లాడటం సాధారణ పరిణామం కాదు. ఇది రేవంత్‌రెడ్డి నాయకత్వానికి మద్దతుగా కనిపించినప్పటికీ, మరో కోణంలో చూస్తే కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత అసంతృప్తులు కూడా బయటపడుతున్నాయా అన్న ప్రశ్న తలెత్తుతుంది. అయితే "ఈ ఎమ్మెల్యేల వెనుక ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా ఉన్నారు" అని నిర్ధారించడానికి ఆధారాలు లేవు. రాజకీయంగా అలాంటి అనుమానాలు, ప్రచారాలు ఉండవచ్చు కానీ వాటిని వాస్తవాలుగా పేర్కొనడం సరికాదు. సంపాదకీయ దృష్టిలో ఈ తేడాను గుర్తించడం అవసరం.

**బర్తరఫ్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందా?**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలన్న డిమాండ్లు ఇప్పటికే బహిరంగమయ్యాయి. కొన్ని నివేదికలు కేంద్ర నాయకత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోందని పేర్కొన్నాయి. అయితే ఇది రాజకీయ వర్గాల సమాచారం, అధికారిక నిర్ణయం కాదు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో సురేఖ ఇంకా మంత్రిగా కొనసాగుతున్నట్లు ఉంది. ఇక్కడ కాంగ్రెస్ అధిష్ఠానం చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సురేఖను బర్తరఫ్ చేస్తే "ముఖ్యమంత్రిపై కుటుంబ సభ్యుడు విమర్శలు చేస్తే మంత్రి పదవి పోతుంది" అనే కఠిన సందేశం పార్టీకి వెళ్లవచ్చు. ఇది క్రమశిక్షణ పరంగా ముఖ్యమంత్రికి తాత్కాలికంగా బలం ఇవ్వొచ్చు. కానీ అదే సమయంలో కొండా కుటుంబానికి రాజకీయ సానుభూతి కలిగించే ప్రమాదం కూడా ఉంది. మరోవైపు చర్యలు తీసుకోకుండా వదిలేస్తే, ముఖ్యమంత్రి నాయకత్వాన్ని బహిరంగంగా ప్రశ్నించినా పార్టీ పెద్దగా పట్టించుకోదనే సంకేతం వెళ్లవచ్చు. తద్వారా భవిష్యత్తులో మరింత మంది నాయకులు బహిరంగ వ్యాఖ్యలకు దిగే అవకాశం ఉంటుంది. అందుకే బర్తరఫ్ ఒక్కటే పరిష్కారం కాదు; పార్టీ క్రమశిక్షణకు స్పష్టమైన, అందరికీ సమానమైన ప్రమాణాలు ఉండటం అసలు పరిష్కారం.

**రేవంత్‌కు ఇది నాయకత్వ పరీక్ష**

ఈ వివాదం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా ఒక పరీక్షే. ముఖ్యమంత్రి తనకు వ్యతిరేకంగా వచ్చిన ప్రతి రాజకీయ స్వరాన్ని అణచివేయాలని చూస్తున్న నాయకుడిగా కనిపించకూడదు. అదే సమయంలో తన నాయకత్వాన్ని ఎవరైనా బహిరంగంగా సవాలు చేసినా మౌనంగా ఉండే బలహీన నాయకుడిగానూ కనిపించకూడదు. కాంగ్రెస్‌లో సమస్య వ్యక్తుల మధ్య విభేదం కాదు; పార్టీలో నిర్ణయాధికారం ఎవరిది? టికెట్లపై తుది నిర్ణయం ఎవరిది? ప్రభుత్వంలో మంత్రుల బాధ్యత ఎంత? పార్టీ క్రమశిక్షణకు హద్దులు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం అవసరం. కేంద్ర నాయకత్వం కూడా ఇదే విషయాన్ని గమనించాల్సి ఉంటుంది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమాచారం సేకరిస్తున్నట్లు నివేదికలు వచ్చాయి.

**కాంగ్రెస్‌కు ఇప్పుడు కావాల్సింది రాజీనా? క్రమశిక్షణా?**

సురేఖ క్షమాపణ చెబితే వివాదం సద్దుమణిగే అవకాశం ఉంది. అది పార్టీకి తక్షణ ఉపశమనం కలిగించవచ్చు. కానీ అసలు సమస్య మాత్రం అలాగే మిగిలిపోతుంది. పరకాల విషయంలో ఉన్న రాజకీయ అసంతృప్తులు, స్థానిక నాయకుల మధ్య విభేదాలు, టికెట్లపై పోటీ, వ్యక్తిగత ఆధిపత్య పోరాటాలు పరిష్కారం కాకపోతే మరో సందర్భంలో మరో వివాదం తప్పదు. అందుకే కాంగ్రెస్ నాయకత్వం ఒక వ్యక్తిపై చర్య తీసుకోవడం కంటే పార్టీలోని అంతర్గత రాజకీయాలను చక్కదిద్దడంపై దృష్టి పెట్టాలి. క్రమశిక్షణ అవసరం. కానీ క్రమశిక్షణ అంటే భిన్నాభిప్రాయాలను అణచివేయడం కాదు. నాయకత్వాన్ని ప్రశ్నించడం, పార్టీ నిర్ణయాలను ధిక్కరించడం మధ్య తేడా ఉండాలి. కుటుంబ సభ్యుల వ్యాఖ్యలకు మంత్రిని ఎంతవరకు బాధ్యురాలిని చేయాలన్న దానిపైనా స్పష్టమైన ప్రమాణం అవసరం. కొండా సురేఖ ఎపిసోడ్‌లో తక్షణ రాజకీయ లాభనష్టాల కంటే కాంగ్రెస్ పార్టీకి దీర్ఘకాలికంగా ఏ నిర్ణయం మేలు చేస్తుందో అదే కీలకం. ఒక మంత్రి పదవిని తొలగించడం ద్వారా ఒక వివాదానికి తెరపడొచ్చు. కానీ పార్టీ అంతర్గత అసంతృప్తులకు తెరపడదు. వ్యక్తులపై క్రమశిక్షణతో పాటు వ్యవస్థలో సమన్వయం లేకపోతే తెలంగాణ కాంగ్రెస్‌లో ఇలాంటి రాజకీయ ప్రకంపనలు మళ్లీ మళ్లీ తప్పవు.

# కోర్టులకు ఇచ్చిన అధికారాలేంటి..?

ఏ దేశంలో అయినా చట్టబద్ధ పాలన జరగాలంటే.. అందుకు పటిష్ఠమైన వ్యవస్థలు అవసరమౌతాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే మన రాజ్యాంగ నిర్మాతలు న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలకు రూపకల్పన చేశారు. అలాగే ప్రతి వ్యవస్థ అధికారాల పరిధిని స్పష్టంగా నిర్వచించారు. ఒకరి అధికారాల పరిధిలోకి మరొకరి జోక్యం లేకుండా లక్ష్మణరేఖ గీశారు. అదే సమయంలో మిగతా వ్యవస్థల పనితీరును రాజ్యాంగబద్ధంగా సమీక్షించే అధికారం న్యాయవ్యవస్థకు అప్పగించారు. కానీ ఈ అధికారాన్ని నియంత్రణగా కాకుండా.. ఓ అప్రమత్తతగానే చూడాలనేది నిపుణుల మాట. ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వం ఓ పథకం తెస్తుంది. ఓ పాలసీ నిర్ణయిస్తుంది. అధికారులు ఆ పాలసీ లేదా పథకాన్ని అమలుచేస్తారు. ఈ అమలు తీరులో తప్పులు, లోపాలు, లోటుపాట్లను బట్టి.. అలాంటి సందర్భంలో కోర్టులు జోక్యం చేసుకుంటాయి. నిర్దిష్ట ఫిర్యాదులమేరకైనా, సుమోటోగా అయినా కూడా న్యాయస్థానాలు కల్పించుకోవచ్చు. కానీ అసలు పథకాలే తేవద్దని, న్యాయస్థానాలు అంటే అక్కడే ఘర్షణ వస్తుంది. మనది ప్రజాస్వామ్య దేశం. అలాగే సమాఖ్య వ్యవస్థ. ఈ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరి బాధ్యతలు వారికున్నాయి. మళ్లీ అటు కేంద్ర స్థాయిలో.. ఇటు రాష్ట్రస్థాయిలో పాలన సజావుగా జరగటానికి ప్రత్యేక వ్యవస్థలున్నాయి. ఈ దేశంలో నిజమైన అధికారం ప్రజలదే అని చాటేది ప్రజాస్వామ్యం. మరి ఆ ప్రజల అవసరాలు తీర్చటానికి రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైనవే వ్యవస్థలు. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల కోసం చట్టాలు చేస్తే.. వాటిని అమలు చేసే బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థ తీసుకుంటుంది. ఈ వ్యవస్థ పరిధిలోకి క్యాబినెట్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు వస్తారు. అయితే అటు శాసన వ్యవస్థ, ఇటు కార్యనిర్వాహక వ్యవస్థ పరిధుల్లో జోక్యం చేసుకునే అవకాశం న్యాయవ్యవస్థకు లేదు. కానీ ఏ వ్యవస్థ చేసే పనులైనా.. రాజ్యాంగబద్ధంగా లేకపోతే.. కచ్చితంగా తప్పొప్పుల్ని కోర్టులు సమీక్షించొచ్చు. దీనికి ఏ వ్యవస్థా అభ్యంతరం చెప్పే పరిస్థితి ఉండదు. అంతేకాదు ఎవరు చెప్పినా.. ఆ విషయంపై అస్పష్టత ఉంటుందేమో కానీ.. ఒక్కసారి కోర్టు ఓ మాట చెప్పిందంటే.. కచ్చితంగా దేశంలో మిగతా వ్యవస్థలే కాదు.. ప్రజలు కూడా దానికి కట్టుబడతారు. సాధారణంగా ఈ వెసులుబాటే.. కోర్టుల్ని రాజ్యాంగానికి కాపలాదారుగా సక్సెస్‌ఫుల్‌గా నిలబెడుతోంది. కానీ కొన్ని సందర్భాల్లో కోర్టులు కూడా కట్టుదాటుతున్నాయా అనే సందేహాలొచ్చేలా కొన్ని ఆదేశాలు వస్తున్నాయి. అయితే అలాంటి సందర్భాల్లో కొన్నిసార్లు కోర్టులే తమ అధికారాల పరిధిపై క్లారిటీ ఇచ్చిన కేసులు కూడా ఉన్నాయి. అంటే మన న్యాయవ్యవస్థ కేవలం తీర్పులు చెప్పడమే కాదు.. అవసరమైతే ఆత్మవిమర్శకూ ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటోంది. అంతేకాదు తమకు రాజ్యాంగం సర్వంసహా ఆధిపత్యం ఇచ్చిందని కూడా కోర్టులు ఇప్పటివరకు పొరపాటున కూడా అనుకోలేదు. పైగా కేవలం రాజ్యాంగ పరిరక్షకులుగా ఈ దేశ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినమ్రంగా వాడుకుంటున్నామనే మాటనే చాలా స్పష్టంగా చెబుతూ వచ్చిన సందర్భాలు లేకపోలేదు. కాకపోతే తెలంగాణలో ఇటీవలి కాలంలో కోర్టులు ఇస్తున్న ఆదేశాలపై చర్చ జరుగుతున్న మాట వాస్తవం. కొన్నాళ్ల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని కోర్టు ఇచ్చిన ఆదేశం చర్చనీయాంశమైంది. అసలు అలా ఆదేశించే అధికారం కోర్టుకు ఉందా.. లేదా అనే ప్రశ్నలు తలెత్తాయి. దీనిపై న్యాయవర్గాల్లోనూ భిన్నమైన వాదనలు వినిపించాయి. మొదట అసలు అధికారుల బదిలీలు, పోస్టింగులు ప్రభుత్వ పరిధిలోని అంశాలని, వాటపై కోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందనే సందేహాలు వచ్చాయి. తర్వాత కోర్టు ధిక్కరణ అంశం తెరపైకి రావడంతో.. అలాంటప్పుడు జరిమానాలు విధించే, శిక్షించే అధికారం కోర్టుకు ఉంటుందని, కానీ ఎవరిని ఏ పోస్టులో నియమించాలో కోర్టు ఎలా చెబుతుందని సర్కారు తరపు నుంచి కూడా అభిప్రాయం వచ్చింది. ఆ తర్వాత ఈ విషయంలో అప్పీళ్లకు కూడా వెళ్లాల్సి వచ్చింది. ఈ సంగతి పక్కనపెడితే.. తాజాగా సంక్షేమ పతకాలపై న్యాయస్థానాల అభిప్రాయాలు, ఆదేశాలు కూడా చర్చనీయాంశమౌతున్నాయి. సంక్షేమ పథకాల అమలుకు, జీతాలు, పెన్షన్ల చెల్లింపులకు ముడిపెట్టడంపై కొత్త సందేహాలొచ్చాయి. రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యత ప్రకారం.. ప్రభుత్వాలకు సంచిత నిధిని తమ సౌలభ్యం, అవకాశాన్ని బట్టి ఖర్చు చేసే వీలుంది. ప్రభుత్వం అన్నాక సంక్షేమం, అభివృద్ధి, చెల్లింపులు అన్నీ చేయాల్సి ఉంటుంది. ఏది ఎప్పుడు చేయాలనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారం అనే వాదన కూడా లేకపోలేదు. ఈ సందర్భంగా అసలు సంక్షేమ పథకాల అవసరం, ఉద్దేశాలపై కొత్త చర్చ మొదలైంది. మనది సంక్షేమ రాజ్యం కావాలని రాజ్యాంగ నిర్మాతలు అభిలషించారు. అందుకే అనుగుణంగా తొలినాళ్ల నుంచీ దేశంలో, రాష్ట్రాల్లో ఏ సర్కారు అధికారంలో ఉన్నా.. ఏదో రూపంలో సంక్షేమం కొనసాగుతూనే ఉంది. ఉదాహరణకు దేశవ్యాప్తంగా 80 శాతం ప్రజలకు రేషన్ బియ్యం అందుతోంది. కేంద్రం చేయాల్సిన చెల్లింపులు పూర్తిస్థాయిలో జరిగేదాకా.. రేషన్ బియ్యం పంపిణీ ఆపమంటే.. కుదురుతుందా.. అసలు అలా చెప్పే అధికారం కోర్టులకు ఉంటుందా అనేదే ఇక్కడ అసలు మీమాంస. దేశంలో సంక్షేమ పథకాల కారణంగానే కొన్నికోట్ల కుటుంబాలు జీవన స్థితిగతులు మెరుగయ్యాయని రికార్డులు చెబుతున్నాయి. ఏకంగా తరాల తలరాతలు మార్చిన సంక్షేమ పథకాలు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అమలయ్యాయి. దేశంలో రేషన్ బియ్యం వచ్చాక ఆకలిచావులు గణనీయంగా తగ్గిన మాట కాదనలేని వాస్తవం. అదే సమయంలో సాగుకు సంక్షేమ దన్నుతో.. రైతుల కష్టాలు చాలా వరకు తగ్గిన మాట నిజం. మధ్యాహ్న భోజన పథకం.. స్కూల్ డ్రాపవుట్స్ సమస్యకు చెక్ పెట్టింది. గణనీయ సంఖ్యలో పిల్లలు బడిబాట పట్టారు అసలు ఆరోగ్యశ్రీ లాంటి స్కీముల గురించి పునరాలోచన చేసే స్థితి కూడా లేదంటే.. దేశంలో, రాష్ట్రాల్లో సంక్షేమం అమలు సాధించిన విజయాలు అర్థమౌతాయి. దేశంలో ఇంకా దారిద్ర్య రేఖకు దిగువన కోట్ల మంది ఉన్నారు. వీరి కనీస అవసరాలు తీరాలన్నా, జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నా సంక్షేమ పథకాలు తప్పనిసరి. ఎప్పుడో 1970ల్లోనే ఇందిరాగాంధీ గరీబీ హఠావో నినాదం ఇచ్చారు. బర్రె-గొర్రె లాంటి స్కీములు పెట్టారు. వివిధ వర్గాల జీవన పరిస్థితుల్ని బట్టి.. ప్రత్యేక పథకాలు తీసుకొచ్చారు. ఒక దేశ ఆర్థికాభివృద్ధి ఎంత ముఖ్యమో.. సామాజిక పురోగతి కూడా అంతే ప్రధానం. సామాజిక అభివృద్ధి జరగాలంటే అన్ని వర్గాలు ముందడుగు వేయాలి. అట్టడుగు వర్గాలకు చేయూత ఇవ్వడం తప్పనిసరి. అప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగై.. దేశాభివృద్ధిలో భాగం పంచుకోవడం కుదురుతుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా సంక్షేమం వద్దనడం సబబు కాదనే అభిప్రాయాలున్నాయి. చాలా దేశాలతో పోలిస్తే.. మన దగ్గర ఉచితాలు బాగా వర్కవుట్ అయ్యాయి. కోట్లాది మంది పేదలు పేదరికం నుంచి బయటికొచ్చి ఊహించని విధంగా దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారు. నిజంగా సంక్షేమ పథకాలే లేకపోతే అసలు కొన్ని వర్గాల ప్రజల జీవితం ఇప్పటికీ మారి ఉండేది కాదనే వాదనతో మేధావులూ ఏకీభవిస్తారు. మొత్తంగా సంక్షేమ పథకాలు కూడా మానవ అభివృద్ధికి, పోషకాహారం, పని మొదలగు వాటిపై ప్రజల మౌలిక హక్కుల సంరక్షణకు, ముఖ్యంగా గౌరవంగా జీవించే హక్కుకు దోహదం చేస్తాయి. వృద్ధాప్య, ఒంటరి మహిళలు, వికలాంగుల పెన్షన్లు, పట్టణ ప్రాంతాల్లో కమ్యూనిటీ వంటశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఉచిత యూనిఫాం దుస్తులు, పాఠ్య పుస్తకాలు మరియు ఉచిత వైద్య సేవల లాంటి ఇతర అనేక పథకాలు...మన దేశంలో సామాజిక భద్రత, మౌలిక సదుపాయాల కల్పనలో చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. వాస్తవానికి ఈ పథకాలలో అనేక లోపాలున్నాయి. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా విస్తరించాలి. ఎక్కువ వనరుల కేటాయింపులు జరగాలి. జవాబుదారీతనం, సమస్యల పరిష్కారానికి యంత్రాంగాలను పెంచాల్సిన అవసరం ఉంది. ఈ లోపాలు సరిదిద్దుకోవాలనడం తప్పు కాదు. ఆ లోపాల గురించి కోర్టులు ప్రస్తావన చేయొచ్చు. వాటిని మరింత మెరుగ్గా ఎలా అమలు చేయాలో సలహా ఇవ్వొచ్చు. అంతేకాదు పథకాలు చట్టబద్ధం కాకపోయినా, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగినా.. కోర్టుకు శిక్షించే అధికారం ఎప్పుడూ ఉంటుంది. అంతేకానీ అసలు సంక్షేమం ఉండొద్దనడం మాత్రం సరైన పద్ధతి కాదనే వాదన వినిపిస్తోంది.

# ఉన్నతాధికారులు కాస్త తేడాగా ఉన్నారా?

తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్నాయి. దీంతో... రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్ళయినా... ఇప్పటి వరకు ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించడంలో అధికారులు విఫలమైయ్యారన్న వాదన బలపడుతోంది. ఈ మూడేళ్ళలో పలు కీలక అంశాలపై హడావుడిగా జీవోలు విడుదల చేయడం, తర్వాత పర్యవసానాలను చూసి ఆపేయడం లాంటివి జరిగాయి. ముఖ్యంగా వరుస భూ వివాదాలు ప్రభుత్వ పెద్దల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయట. దీంతో... ప్రభుత్వ ఉన్నతాధికారుల పనితీరుపై చర్చ మొదలైంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల అంశంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అవుతోంది. దీంతో... రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయంలో ప్రజలకు జరిగిన అసౌకర్యంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పింది. లక్షల ఎకరాల ప్రయివేటు భూములు, ఆస్తులను 22ఏలో చేర్చడం ద్వారా ఏ పాపం తెలియని అమాయకులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పెరిగిపోవడంతో... రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఉన్నతాధికారులతో రివ్యూ చేశారు సీఎం. ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఆస్తులను అధికారులు పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చారని... అందుకు ప్రభుత్వం తరపున క్షమాపణలు చెబుతున్నామని ఆ తర్వాత అన్నారు పొంగులేటి. ఇక నిరుడు రాష్ట్ర ప్రభుత్వం హిల్ట్ పాలసీ తీసుకు వచ్చింది. అది రూపొందక ముందే.. వివరాలు ప్రతిపక్షాలకు విషయం లీక్ అయ్యాయి. అస్త్రంగా మలచుకున్న బీఆర్ఎస్... లక్షల కోట్ల విలువైన భూములను ప్రభుత్వ పెద్దలు తమ బంధువులకు, నచ్చిన వారికి కట్టబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారంటూ ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం అటు అసెంబ్లీలో ఇటు ప్రజా క్షేత్రంలో సంజాయిషీ ఇచ్చు కోవాల్సి వచ్చింది. మరో ఘటనలో సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇలాకాలో రైతులు ఆందోళనలు చేస్తున్నా.. ఆ విషయాన్ని ఆయనకు చెప్పడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అటు అటవీ భూముల విషయంలో కూడా అదే తరహా వివాదం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి... ఆ జీవోని నిలిపివేస్తున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది. అటు కొద్ది రోజుల క్రితం హెచ్‌సీయూ భూముల వివాదం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. శేరిలింగంపల్లి పరిధిలోని కంచె గచ్చిబౌలిలో సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానిదేనని, వేలం వేయాలని సర్కార్ నిర్ణయించింది. దానిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడమేగాక సుప్రీం కోర్టు వరకు వెళ్ళింది. ఆ 400 ఎకరాలు యూనివర్సిటీవేనంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. జాతీయ స్థాయిలో పర్యావరణ ప్రేమికులు, ఎన్జీవోలు, ప్రజా సంఘాలు, ప్రభుత్వ తీరును తప్పు పట్టాయి. దీంతో... సెంట్రల్ యూనివర్శిటీ భూములపై కూడా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అలాగే... వికారాబాద్ జిల్లా లగచర్ల, హకీంపేట గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామ సభలకు వెళ్లిన కలెక్టర్, రెవెన్యూ అధికారులపై ప్రజలు తిరగబడ్డారు. ఫార్మా కంపెనీలను రైతులు వ్యతిరేకిస్తున్నా ఆ అంశంలోని సున్నితత్వాన్ని ఉన్నతాధికారులు గుర్తించ లేకపోయారు. దాంతో రచ్చ రచ్చ అయింది. చివరికి లగచర్ల ఫార్మా భూసేకరణపై వెనక్కి తగ్గింది రేవంత్ రెడ్డి సర్కార్. అలాగే... తమ గ్రామాలకు యమపాశంగా మారుతున్నదన్న కారణంతో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు. గ్రామాల్లో అధికారులపై భౌతిక దాడులు జరిగాయి. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఇక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ విషయంలోనూ అదే సమస్య. గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో ఫార్మా సిటీ కోసం సుమారు 20 వేల ఎకరాలు సేకరించింది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే శాటిలైట్ టౌన్ షిప్స్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫైనల్గా అది ఫ్యూచర్ సిటీ అయ్యింది. ఒకటి కాదు, రెండు కాదు... ఇలా చాలా సందర్భాల్లో హడావిడిగా జీవోలు ఇవ్వడం, వెనక్కి తీసుకోవడం కామన్ అయిపోయింది. దీంతో... ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలు చెప్పిన మాటలు వినడంలేదా? ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో వాళ్ళకు అర్థం కావడంలేదా అన్న చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అర్థమైనా కూడా... కొందరు కావాలనే అలా చేస్తున్నారా అన్న సందేహాలు సైతం వివిధ వర్గాల్లో పెరుగుతున్నాయి. ఒక జీవో విడుదల చేసేప్పుడు సమగ్రమైన వివరాలు, తరువాత జరిగే పర్యవసానాల్ని తెలుసుకోకుండా ఉన్నతాధికారులు కొందరు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఇలాంటి కీలకమైన జీవోల విడుదల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని... లేదంటే భారీ డ్యామేజ్ తప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.


# రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలుడు..



**భూదాన్ పోచంపల్లి,ఫ్లాష్ ఇండియా :** కంపెనీలోని రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు అక్కడి కక్కడే మృతి చెందారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దోతి గూడెం గ్రామంలో గల హై జోలో లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా పెద్దాపూర్ మండలం చిన్న గూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి(31), ఖమ్మం జిల్లా చౌదారంకు చెందిన నాగన బోయిన నరేష్ కుమార్ (29) లు స్థానిక హేజీలో కంపెనీలో పని చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి షిఫ్ట్ మారే సమయంలో ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో ఇద్దరు కార్మికులు అక్కడి కక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో నైట్ షిఫ్ట్‌లో దాదాపు 12 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ శబ్దంతో రియాక్టర్ పేలి పోవడం తో కంపెనీలో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ శబ్దానికి తీవ్ర భయాందోళనలకు గురైన గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో కంపెనీ నుంచి దట్టమైన పొగ, భయంకరమైన విషవాయువు వెలుబడింది. దీంతో గ్రామస్తులంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్ రెడ్డి, పోచంపల్లి ఎస్సై జగన్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన క్షతగాత్రులను యాజమాన్యం అంబులెన్స్‌ల ద్వారా హైదరాబాద్‌లోని రెండు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు.

**గత జులై నెలలో ఒకరు మృతి..**

జూలై 16 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా సింగనమల్లు మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన కెమిస్ట్ ఉద్యోగి ఆలమూరు కృష్ణారెడ్డి (43) ఇదే కంపెనీలో పని చేస్తుండగా రియాక్టర్ లో పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. నెల రోజులు గడవక ముందే మరో ఇద్దరు కార్మికులు మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. తరచుగా షిఫ్ట్ మారే సమయంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



# జీతం పెంచమంటే కోరిక తీర్చమన్నాడు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లో ఓ స్టార్ హోటల్ చైర్మన్‌పై అందులో పనిచేసే మహిళ లైంగిక ఆరోపణలు చేసింది. హోటల్ చైర్మన్ మనోహర్ జీతం పెంచాలని అడిగినందుకు కోరిక తీర్చాలంటూ బలవంతం చేశాడని బేగంపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. అంత్తకాకుండా నో చెప్పినందుకు హెచ్ఆర్, ఐటీ సిబ్బందితో బెదిరించి తనను ఉద్యోగం నుండి తొలగించారని ఆరోపించింది. ఇటీవల ఓ న్యాయవాది పేరుతో ఫోన్ చేసి బెదిరించారంటూ మహిళ ఫిర్యాదులో పేర్కొంది. షీటీమ్స్, మహిళా సంక్షేమ విభాగానికి సైతం మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో హోటల్ చైర్మన్ తో పాటు అతడికి సపోర్ట్ చేసిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునే అవకాశం అవకాశం ఉంది. ఇందు కోసం ప్రత్యేక చట్టాలు సైతం అమలులో ఉన్నాయి.

# చెట్టు కిందే డ్యూటీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో కొంతమంది పోలీసు సిబ్బందికి ఉద్యోగం కేవలం రెండు గంటలు మాత్రమే ఉంటోంది. అది కూడా పోలీసు కమిషనరేట్ కార్యాలయం పరిసరాల్లో ఏదైనా చెట్టు కింద కూర్చోవాలి. రెండు గంటల తర్వాత ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఇలా నెల రోజుల నుంచి ఈ పరిస్థితి నెలకొన్నా ఎవరు మమ్మల్ని పట్టించుకోవడం లేదని కొంత మంది పోలీసు అధికారులు వాపోతున్నారు.

**ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందంటే..**

గత నెల జూలై నెలలో కొంత మంది పోలీసు సిబ్బంది ఇతర పోలీసు కమిషనరేట్ నుంచి మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌కు రిపోర్టు చేశారు. అప్పటి నుంచి వారికి తాత్కాలిక పోస్టింగ్ ఇవ్వకుండా, శాశ్వత పోస్టింగు కల్పించకుండా జస్ట్ టెక్నికల్ ఎర్రర్ అంటూ వారిని పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి అడ్మిన్ విభాగం అధికారులు తిప్పించుకుంటున్నారు. పోలీసు కమిషనరేట్‌కు రిపోర్టు చేసినప్పుడు ఆ సిబ్బందికి తాత్కాలిక పోస్టింగ్ కల్పించే అధికారం అడ్మిన్ ఉన్నతాధికారి, అధికారులకు ఉన్నా కేవలం నిర్లక్ష్యంతోనే వారికి పోస్టింగ్ కల్పించకుండా మౌనంగా ఉంటున్నారని పోలీసు వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలా రిపోర్టు చేసిన ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు ఇతర స్థాయి అధికారులు 5 నుంచి నెల రోజుల తరబడి జీతం తీసుకుని ఉద్యోగం చేయకుండా పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి చక్కర్లు కొట్టే పరిస్థితి సర్వసాధారణంగా మారిపోయిందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. కేవలం అడ్మిన్ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని పోలీసు వర్గాలు విమర్శిస్తున్నాయి. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ ఈ విషయాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని పోలీసు వర్గాలు కోరుతున్నాయి.

# సుందరంగా సున్నం చెరువు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒక వైపు బోరబండ బస్తీ.. మరో వైపు ఐటీ కారిడార్ ఇలా మాదాపూర్ గుట్టల బేగంపేటలో మురికి కూపంగా ఉన్న సున్నం చెరువును సర్వాంగ సుందరగా హైడ్రా తీర్చిదిద్దుతోంది. ఆక్రమణలతో కుచించుకుపోయి మురుగు నీటి కుంటలా మారిన సున్నం చెరువుకు పూర్వ వైభవం తెచ్చేందుకు హైడ్రా పెద్ద కసరత్తే చేస్తోంది. 14.20 ఎకరాలకు కుచించుకుపోతే.. ఆక్రమణలను తొలగించి 30.5 ఎకరాలుగా హైడ్రా విస్తరించింది. ఎక్కడా నిర్మాణ నివాసాలను తొలగించలేదు. ఇక్కడి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పాదరసం, సీసం, ఆర్సెనిక్, ఫ్లోరైడ్, పురుగుమందు వంటి విషపూరిత పదార్థాలు ఉన్నట్టు పీసీబీ నివేదిక ఇచ్చింది. తాత్కాలిక షెడ్డులు వేసి మురుగు నీటి దందాకు హైడ్రా చెక్ పెట్టింది. మూడు మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మురుగు వాసన లేకుండా హైడ్రా చేసింది. అక్కడ దుర్గంధభరిత వాతావరణం తొలగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెరువు ప్రారంభానికి ముందే వేలాది మంది ఉదయం, సాయంత్రం చెరువు చుట్టూ నిర్మించిన బండ్ మీద వాకింగ్ చేస్తున్నారు. మరి కొన్ని రోజుల్లో చె రువు అభివృద్ధి పనలు పూర్త–వ్వనున్నాయి. సీఎం రే వంత్‌రెడ్డి చేతుల మీదుగా చెరువు ప్రారంభోత్సవానికి సిద్ధవ–ంవుతోంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గుడిసెలు వేసుకుని ఇబ్బందికరమైన వాతావరణంలో నివాసం ఉన్నవారికి సీఎం చేతులమీదుగా డబుల్ బెడ్ రూం ఇళ్లను అందజేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**సర్వాంగ సుందరంగా ఆంజనేయ గుడి**

చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చుట్టూ చెత్త, చెదారం.. దుర్గంధ భరిత వాతావరణంలో ఉన్న ఆంజనేయ గుడిని హైడ్రా అభివృద్ధి చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ ప్రతినిధులతో పలుమార్లు హైడ్రా సమావేశమైంది. వారు సూచనలను పరిగణనలోకి తీసుకుని గొపురాన్ని నిర్మిస్తోంది. ఆలయానికి వెళ్లే దారితో పాటు.. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి పాత్ వే అందుబాటులోకి తెచ్చింది. ఆలయానికి వచ్చిన వారు కూర–్చునేందుకు పాలరాతి గజబోను నిర్మిస్తోంది. గుడికి ముందు వాటర్ ఫౌంటైన్‌లో ఆంజనేయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ పనులు త్వరలోనే పూర్తి చేసి గుడికి మంచి రూపాన్నిస్తోంది. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న అభివృద్ధిని ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతిస్తున్నారు. అక్కడ కొంతమంది గుడిని అడ్డంపెట్టుకుని అభివృద్ధిని అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఆలయాన్ని హైడ్రా తొలగిస్తున్నదనే తప్పుడు ప్రచారాన్ని చేస్తూ లేనిపోని గందరగోళానికి సిద్ధమవుతున్నారు. దీంతో ఆలయ కమిటీ ప్రతినిధులు అప్రవ–ంత్తమయ్యారు.

**చెరువు చుట్టూ ఆకర్షణలు**

సున్నం చెరువు చుట్టూ విశాలమైన బండ్‌పై పాత్‌వే సిద్ధమైంది. ఎక్కడికక్కడ కూర్చునేందుకు రాతి కుర్చీలను, సేద దీరేందుకు గజబోలను అందుబాటులోకి హైడ్రా తీసుకు వస్తోంది. పిల్లల ప్లే ఏరియాలు, పచ్చిక బైళ్లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తోంది. చెరువుచుట్టూ ఔషధ, సుగంధ మొక్కలు, నీడనిచ్చే చెట్లను నాటి పచ్చదనాన్ని పెంచుతోంది. 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. బతుకమ్మలు ఆడేందుకు బేబీ పాండ్‌ను అందుబాటులోకి తెస్తున్నది. చెరువులో బోటింగ్ చేసే విధంగా పర్యాటక ఏర్పాట్లు అందుబాటులోకి రానున్నాయి. చెరువు గట్టు చుట్టూ సోలార్ లైట్లు ఏర్పాటు చేయడమే కాకుండా.. పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. చెరువుకు ఆనుకుని ఉన్న సహజసిద్ధమైన కొండను హైడ్రా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది.

# 30 శాతం కమీషన్ల కోసమే



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బోడుప్పల్ పరిధిలోని పలు కాలనీల ప్రజల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, రేవంత్ రెడ్డి సర్కార్‌ను '30 శాతం కమిషన్ ప్రభుత్వం' అని ప్రజలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితా పేరుతో ప్రజల ఆస్తులను కబ్జా చేసే హక్కు రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని ఆయన నిలదీశారు.

**దశాబ్దాల నివాసాలపై 22ఏ నిబంధన.. కాలనీ వాసుల్లో ఆందోళన**

బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది బాధితులు హరీష్ రావును కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, సర్వే నంబర్ 215, 215 పార్టలలో గత 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు ప్రశాంతంగా జీవిస్తున్నాయని తెలిపారు. అయితే, ఈ ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అత్యవసర కష్టాల్లో ఇళ్లను అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలియడంతో ప్రజలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కమీషన్ల కోసమే కృత్రిమ వివాదాలు.. బీఆర్ఎస్ పోరాట హెచ్చరిక**

చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఆస్తులను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ప్రభుత్వం ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తోందని హరీష్ రావు విమర్శించారు. దశాబ్దాలుగా నివాసముంటున్న ప్రజలకు 22ఏ భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆయన ధ–్వజమెత్తారు. బోడుప్పల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులెవరూ అధైర్యపడవద్దని, ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా బాధితుల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని, లేకపోతే బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# వనపర్తి కాంగ్రెస్‌లో ముదిరిన ముసలం!

**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మధ్య గత కొంత కాలంగా సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. మాటల యుద్ధం వల్ల చెలరేగిన మంటలు వనపర్తి నుంచి హైదరాబాద్, అటు నుంచి ఢిల్లీకి పాకాయి. గోపాల్‌పేట వేదికగా చిన్నారెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీలో పెను ప్రకంపనలు సృష్టిస్తుండగా, వివాదం చిలికి చిలికి గాలివానలా మారుతోంది. ఎన్నికల నాటి నుంచే ఇరు నేతల మధ్య సమన్వయ లోపం ఉండగా, పాలన మొదలయ్యాక అది మరింత తీవ్రమైంది. వివాదరహితుడిగా పేరున్న సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి ఇలా బహిరంగ విమర్శలకు దిగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. పార్టీలో చేరింది మొదలు ఎన్నికలు ముగిసి పాలన మొదలైన తరువాత కూడా డాక్టర్ చిన్నారెడ్డి చేసే వ్యాఖ్యానాలను ఎమ్మెల్యే సీరియస్ గా తీసుకోవడం.. అధిష్టానానికి ఫిర్యాదు చేయడం జరుగుతూ వచ్చింది. ఆమధ్య అధిష్టానం లోని ముఖ్య నాయకులు కల్పించుకొని కలిసి పని చేయాలని చేసిన సూచనలతో పరిస్థితులు కొంత బాగున్నప్పటికీ చిన్నారెడ్డి ఒక్కసారిగా మళ్లీ తన మనసులో ఉన్న అక్కసును బయట పెట్టడంతో అలజడి మొదలైంది. చిన్నారెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి వెంటనే రంగంలోకి దిగారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారంటూ టీపీసీసీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ మల్లు రవి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు ఫిర్యాదు చేశారు. అనంతరం తన అనుచర వర్గంతో కలిసి ఢిల్లీకి చేరుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై పూర్తి నివేదిక తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యే ఫిర్యాదుకు ప్రతిగా చిన్నారెడ్డి మద్దతుదారులు సైతం దూకుడు పెంచారు. ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివచ్చిన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మొదటినుంచి పార్టీ జెండా మోసిన పాత కేడర్‌ను ఎమ్మెల్యే విస్మరిస్తున్నారని, కొత్తగా వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ పార్టీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా డాక్టర్ చిన్నారెడ్డి వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తప్పనిసరిగా ఉంటాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. మొత్తంపైన పార్టీ లైన్ దాటి వ్యవహరించిన వారి పై క్రమశిక్షణా చర్యలు ఉంటాయా లేక ఉమ్మడి పాలమూరు జిల్లా సీనియర్ నేతలతో అధిష్ఠానం సయోధ్య కుదురుస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

# మంత్రి కొండా సురేఖపై మరో కంప్లైంట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం తీవ్రంగా చర్చనీయాంశమైంది. కొండా సురేఖ వ్యవహారశైలి, ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కలిసే అధికారికంగా ఫిర్యాదు చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్యేల ఫిర్యాదుపై మల్లు రవి స్పందిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన వివరణను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఖండించాల్సిన బాధ్యత సురేఖదే..**

ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై ఆమె కుమార్తె చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ బహిరంగంగా ఖండించాలని, అలా చేయడం ఆమె కనీస బాధ్యత అని పేర్కొన్నారు. 'డబ్బులు ఇచ్చి సీటు కొన్నారు' అంటూ వచ్చిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర కలకలం రేపాయని, దీనిపై సీరియస్‌గా దృష్టి సారించామని తెలిపారు. మరోవైపు నేత చిన్నారెడ్డి వ్యవహారంలోనూ కమిటీ పరిశీలన పూర్తయ్యాక తుది చర్యలు ఉంటాయని చెప్పారు. సీనియర్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించి ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని తేల్చిచెప్పారు. త్వరలోనే క్రమశిక్షణా కమిటీ పూర్తిస్థాయిలో సమావేశమై పార్టీ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కీలక నిర్ణయాలు తీసుకోనుందని మల్లు రవి వెల్లడించారు.

# గచ్చిబౌలిలో హైటెన్షన్..

## కుప్పకూలిన 7 అంతస్తుల భవనం..!

**గచ్చిబౌలి,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని మాదాపూర్ సర్కిల్ పరిధి గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఈరోజు (శనివారం) ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. కేవలం 50 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా పక్కకు వాలి సమీపంలోని వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. మృతిచెందిన వారిని మధ్యప్రదేశ్‌కు చెందిన మహబత్, ఉమేశ్‌గా గుర్తించారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా ఈ బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాలను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది.

**రెండు మృతదేహాలను గుర్తించాం: సుధాకర్ రావు**

ఈ ప్రమాదంపై రీజనల్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ రావు ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. భవనం కుప్పకూలిందనే సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలికి చేరుకున్నామని తెలిపారు. విక్టిమ్ లోకేషన్స్ సిస్టం ద్వారా శిథిలాల కింద రెండు



మృతదేహాలు ఉన్నట్లుగా గుర్తించామని అన్నారు. ఆ మృతదేహాలను వెలికి తీసి పోలీసులకు అప్పగించామని చెప్పారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా..? అని తనిఖీలు చేస్తున్నామని అన్నారు. ఉదయం భవనంలో పనిచేయడానికి ఇద్దరు వచ్చినట్లుగా స్థానికులు చెప్పారని సుధాకర్ రావు పేర్కొన్నారు.

## మలబార్ గోల్డ్ & డైమండ్స్ పునరుద్ధరించిన సోమాజిగూడ షోరూమ్ ఆవిష్కరణ




**హైదరాబాద్,,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మలబార్ గోల్డ్ & డైమండ్స్ హైదరాబాద్‌లోని సోమాజిగూడలో పునరుద్ధరించిన షోరూమ్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. 'సోమాజిగూడ గ్రాండర్ ద్యాన్ ఎవర్ –ఎ ల్యాండ్‌మార్క్ రీఇమాజిన్డ్' కాన్సెప్ట్‌తో ఆధునీకరించిన ఈ షోరూమ్‌లో బంగారం, వజ్రాలు, ప్లాటినం, రత్నాలు, అన్‌కట్ మరియు వెండి ఆభరణాల విస్తృత కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.ప్రముఖ నటి శ్రీనిధి శెట్టి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మలబార్ గోల్డ్ & డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ – ఇండియా ఆపరేషన్స్ అషేర్ ఓ, హెడ్ – రిటైల్ ఆపరేషన్స్ సిరాజ్ పి.కె షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం. పి. అహమ్మద్ మాట్లాడుతూ, "హైదరాబాద్ మలబార్ గోల్డ్ & డైమండ్స్‌కు ఒక ముఖ్యమైన మార్కెట్. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ, బ్రైడల్ ఆభరణాలతో పాటు లైట్‌వెయిట్, కాంటెంపరరీ డిజైన్లను అందించడంపై వే–ంము దృష్టి సారిస్తున్నాం. పునరుద్ధరించిన సోమాజిగూడ షోరూమ్ మా కస్టమర్–ఫస్ట్ రిటైల్ అనుభవానికి ప్రతిబింబం," అని అన్నారు.

ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రత్నాలు, అన్‌కట్ ఆభరణాలపై వాల్యూ యాడిషన్‌పై 25% వరకు తగ్గింపు సెప్టెంబర్ 14 వరకు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. షోరూమ్‌లో 100% HUID–హాల్‌మార్క్‌డ్ గోల్డ్, సర్టిఫైడ్ డైమండ్స్, జీవితకాల మెయింటెనెన్స్ సపోర్ట్, బైబ్యాక్ పాలసీ, ఫెయిర్–వాల్యూ ఎక్స్ఛేంజ్ వంటి కస్టమర్ ప్రయోజనాలు అందుబాటులో ఉ న్నాయి

## లాడ్జిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ప్రజాప్రతినిధులు



**కొల్లాపూర్ ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ కేంద్రం లో లాడ్జ్ పైన పోలీసుల దాడి విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించిన కొల్లాపూర్ పోలీసులు పేకాట ఆడుతూన్న ఆరుగురు పోలీసులకు పట్టుబడిన కొల్లాపూర్ మున్సిపాలిటీ 12వార్డ్ కౌన్సిలర్ ఇటిక్యాల సాయిరాం యాదవ్, పట్టుబాటు, బోయలపల్లి గ్రామ సర్పంచ్ పూలసి కృష్ణయ్య కూడ పట్టుబాటు, గోవుల వెంకటయ్య, జంగిడి సురేష్ గోపాని వెంకటయ్య, తదితరులు పట్టుబాటు, పెంట్లవెల్లి మార్గంలో ప్రవేట్ లాడ్జ్ లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న కొల్లాపూర్ పోలీసులు శు క్రవారం లాడ్జ్ పై దాడి, కొల్లాపూర్ ఎస్ తెలిపిన వివరాలు టోటల్ అమౌంట్ 55,590 రూపాయలు మరియు ఫోన్లో 7 బైక్ లు 5 స్వాధీనం

చేసుకొని వీరిని కొల్లాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు కొల్లాపూర్ ఎస్ ఐ తెలిపారు,

## కోడేరు లో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి



**కోడేరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఎస్ సి కాలనీలో గండు వెంకటస్వామి మూడు రోజుల కిందట అనారోగ్య కారణాలవల్ల చనిపోవడం జరిగింది.. ఈ విషయం తెలుసుకున్న కోడేరు గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి వారి కుటుంబానికి 10, వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గండు వెంకటస్వామి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం చేసిన కోడేరు గ్రామ ఉప సర్పంచ్ మాసయ్య, వార్డు మెంబర్లు ఆది శరత్ మిద్దె రామకృష్ణ, సొప్పరి సత్యనారాయణ, సొప్పరి శ్రీను, వాల్మీకి సంఘం అధ్యక్షుడు మద్దిలేటి నాయుడు, శాంతయ్య, వాల్మీకి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు,

## గ్రామ కంఠం భూములను సర్వే

**ధన్వాడ,ఫ్లాష్ ఇండియా :** మండల కేంద్రమైన ధన్వాడలో శనివారం గ్రామకంఠ భూములను సర్వే చేశారు. గత కొన్నేళ్ల క్రితం గ్రామకంఠ భూములను ఆక్రమించుకున్నారు అంటూ స్థానికంగా పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు తహసీల్దార్ కార్యాలయం ముందున్న గ్రామ కంఠం భూములను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సర్వే అధికారి రంగయ్య. గ్రామ జిపిఓ భాస్కర్ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో భూములను సర్వే చేశారు. ఈ సర్వేలో 35 గంటల భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించి హద్దులు పాతారు. గ్రామ కంఠం భూములను కబ్జాకు కొంతమంది నాయకులు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్న అంటూ ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 35 గుంటల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని హద్దులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రయ్య ఉపసర్పంచ్ పూజారి నర్సింలు నిఖిల్ వార్డు సభ్యులు బాలకృష్ణ బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం రాజు సిపిఐ నాయకులు వెంకటేష్‌తో పాటుగా పలువురు పాల్గొన్నారు.






## జనగామ మండల సాధారణ సర్వసభ్య సమావేశం విజయవంతంగా నిర్వహణ

**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆదేశాల మేరకు జనగామ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈరోజు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, శాఖల వారీగా సాధించిన ప్రగతి, ప్రజా సమస్యలు మరియు చేపట్టవలసిన తదుపరి చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించబడింది. గౌరవనీయులైన ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. మండల అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన చర్యలపై సమావేశంలో చర్చించి, సంబంధిత శాఖలకు తగిన సూచనలు అందించబడినవి.

## ఎల్నినో ప్రభావం... పంటల పై అప్రమత్తం



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జులై ఆగష్టు మాసాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. జనగామ జిల్లా లో ఇప్పటివరకు 247 .4 మీ. మీ. వర్షం కురవగా ఇది సాధారణ వర్షపాతం కన్నా 43.2 శాతం తక్కువగా నమోదయింది. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న పొడి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటలలో తేమ సంరక్షణ, సమతుల్య పోషక యాజమాన్యం, కలుపు మరియు చీడపీడల సకాలంలో నివారణ చర్యలు చేపట్టి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం--జనగామ కోఆర్డినేటర్ డా. వి. రమ్య సూచించారు. వరి లో ఎక్కడైతే నార్లు పోయలేదో ఆగష్టు మాసంలో వెదజల్లే లేదా డ్రంసీడర్ పద్ధతి లో విధ్యకోవడం మంచిది. వారి నార్లు పోయడం మరియు నాట్లు వేయడం ఆలస్యమయ్యే కొద్దీ రకాలను బట్టి దిగుబడి తగ్గడమే కాకుండా చీడపీడల ఉధృతి కూడా అధికంగా ఆశించే అవకాశం ఉంటుంది. ముదురు నారు నాటాల్సి పరిస్థితులలో మొక్కల మధ్య దూరం తగ్గించుకొని దగ్గర దగ్గరగా నాట్లు వేసుకుంటే దిగుబడి పై ఎటువంటి ప్రభావం ఉండదు. ప్రధాన పొలం లో కలుపు మొక్కల నివారణకు ఎకరానికి 4 కిలోల బెన్సుల్ఫ్యూరం బెన్సుల్ఫ్యూరాన్ మిథైల్ 0.6 % జి ఆర్ ం ప్రేతిలాక్లోర్ ం సైఫనర్ మందును 600–800 మీ. లీ నాటిన 3–5 రోజులలోపు పిచికారీ చేయాలి. వర్షాధారం మీద ఆధారపడి మొక్కజొన్న సాగు చేసుకున్నట్లయితే నీటి కొరత వలన ఆకులు ముడుచుకొని సన్నగా అవడం, మొక్క ఎదుగుదల తగ్గిపోవడం వంటివి గమనించడం జరుగుతుంది. దీని నివారణ కొరకు సరైన సమయం లో నీరు పెట్టుకోవాలి లేదా నీటి ఎద్దడి ఉంటే యూరియా 2 % ద్రావణాన్ని పంటపై పిచికారీ చేస్తే బెట్ట పరిస్థితిని కొంతవరకు తట్టుకోవచ్చు. వర్షాభావ పరిస్థితుల అనంతరం వచ్చిన వర్షాలకు ఎకరా కు 25 కిలోల యూరియా ని అదంగంగా వే–సుకుంటే దిగుబడి పెంచవచ్చు. కత్తెర పురుగు నివారణకు 10– 12 రోజుల పీరు పై వేప సంబంధిత మందు అజాధిరాక్టిన్ (1500 పిపియం) 5 మీ. లీ లేదా ఇమామెకిటిన్ బెంజోయట్ 0.4 గ్రా. లేదా క్లోరాన్ట్రేనీలిప్రోల్ 0.4 మీ. లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. సాధ్యమయినంత వరకు మందు ద్రావణం మొక్కసుడిలో పడేలాగా పిచికారీ చేయాలి. పంట 25–30 రోజుల దశలో ఉన్నప్పుడు, కత్తెర పురుగును గమనించిన వెంటనే పొడి ఇసుకను, సున్నంను (9 పాళ్ళు ఇసుక ం 1 పాళ్ళు సున్నం) కలిపి మొక్కజొన్న సుడులలో వేసుకొన్నచో ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి. పంటలో అంతర కృషి జరిపి ఎకరాకు 50 కిలో ల యూరియా ను పై పాటుగా వేసుకొని మట్టిని మొక్కల వేర్లకు ఎదగదోయవలెను. కంది పంట ప్రస్తుతం 20 నుండి 40 రోజుల దశలో ఉంది. తొలి 60 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అంతరకృషి చేసి కలుపును నివారించి భూమిని గుల్లబారేలా తాయారు చేసినచో భూమిలో తేమ బాగా నిలిచి బెట్టాను కొంతవరకు తట్టుకోగలదు. అంతరకృషి సాధ్యం కానీ పరిస్థితులలో కలుపు నివారణకు విత్తింక 20 రోజులకు ఇమాజితపైర్ 300 మీ. లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినచో గడ్డి, వెడల్పాకు కలుపును నివారించవచ్చు. బెట్ట పరిస్థితులలో రసంపీల్చే పురుగులు ముఖ్యనగ పేనుబంక ఆశించి మొక్కలు రాలిపోతాయి. Kaavuna 20 గ్రా. యూరియా ద్రావణం లేదా 10 గ్రా. మల్టీ–కే లేదా పాలీఫీడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవలెను. పెసర, మినుములో మొక్కలు చిన్నగా ఉన్నప్పుడు తేమను కాపాడుకోడానికి కలుపు మొక్కల నివారణకు అంతర కృషి చేసుకోవాలి. మొగ్గ పూత దశలో బెట్ట పరిస్థితులు ఏర్పడినచో 0.5 % పొటాషియం నైట్రేట్ (5 గ్రా. లీటరు నీటికి) లేదా 0.5 % 19 :19 :19 (5 గ్రా. లీటరు నీటికి) ఆకుల పై పిచికారీ చేయాలి. ఆకు ముడుత వైరస్ ను వ్యాపింపచేసే తామర పురుగుల నివారణకు అసిఫాట్ 1గ్రా లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు ఒక లీటరు నీటికి 0 .2 గ్రా. అసిటామిప్రిడ్ లేదా 1 .25 గ్రా. డైఫెన్త–యురాన్ కలిపి పిచికారీ చేయాలి. పూతలో మారుకా ఆకు ముడుత పురుగు నివారణకు నోవాల్యూరాన్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0 .2 మి.లీ. మందును పిచికారీ చేసుకోవచ్చు. అవసరమయితే వారం రోజుల తరువాత మరల పిచికారీ చేయాలి. ఈ విధంగా రైతులంతా అప్రమత్తంగా ఉండి శా–స్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖా సూచనల మేరకు సమర్థవంతమయిన యాజమాన్య పద్ధతులతో ముందస్తు జాగ్రత్తలు చేపడితే పంటల నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే అవాకాశం ఉ ందని డా. వి. రమ్య తెలిపారు.

## నల్లగొండకు చెందిన కలిశాన్ అశోక్ గురుస్వామికి ఉత్తమ గురు పురస్కారం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండకు చెందిన అయ్యప్ప దేవాలయ గురుస్వామి కలిశాన్ అశోక్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ గురు పురస్కారం లభించింది. శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పందల రాజ వంశీకులు శ్రీ సురేష్ వర్మ చేతుల మీదుగా కలిశాన్ అశోక్ గురుస్వామి ఈ అవార్డును అందుకున్నారు. అయ్యప్ప స్వామి భక్తి కార్యక్రమాల్లో సేవలందిస్తూ, గురుస్వామిగా భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్న కలిశాన్ అశోక్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల నల్లగొండకు చెందిన అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాలుగు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన గురుస్వాముల్లో నల్లగొండ నుంచి కలిశాన్ అశోక్ ఎంపిక కావడం విశేషమని పలువురు పేర్కొన్నారు. నల్లగొండ ప్రాంతానికి ఈ పురస్కారం గర్వకారణమని, అశోక్ గురుస్వామి భక్తి, సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు నిలుస్తుందని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కలిశాన్ అశోక్ గురు–స్వామికి అయ్యప్ప భక్తులు,శ్రేయోభిలాషులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి కి ఘన నివాళులు



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి 157వ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల రెడ్డి హాస్టల్ వద్ద ఆయన విగ్రహానికి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి సమాజ అభ్యున్నతికి,విద్యా రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని విద్య, సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగాలని అన్నారు. సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను ఎప్పటికీ స్మరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,రెడ్డి సంఘం అధ్యక్షుడు వీరవోలు గోపాల్ రెడ్డి,కార్యదర్శి ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ వల్లపు రెడ్డి కోటిరెడ్డి, యాపాల సత్యనారాయణ రెడ్డి, కర్నాటి కరుణాకర్ రెడ్డి, యారాల ప్రభాకర్ రెడ్డి,పుట్ట కృష్ణ సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గోలి అమరేందర్ రెడ్డి,కట్టా వెంకట్ రెడ్డి,మా రెడ్డి అంజిరెడ్డి, అలుగుబెల్లి సురేందర్ రెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మండల పూజలు..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దామరచర్ల మండలం వాచ్య తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ. వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన మండల పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశా–రు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న నల్లమోతు భాస్కరరావు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో వాచ్య తండా గ్రామ ప్రజలు, మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగోతు హథీరామ్ నాయక్,లావూరి మేగ్యా నాయక్,సోము సైదీ రెడ్డి,లావూరి శ్రీను నాయక్, గ్రామ ప్రజలు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే..

**అమ్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎంకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని, కొత్త కార్డులు వాటర్‌ప్రూఫ్‌తో పాటు పలు భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడ్‌తో ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సన్నబియ్యం పథకం ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సెమీస్ అవకాశాలు సంక్లిష్టం



హాకీ వరల్డ్ కప్-2026లో భారత మహిళల హాకీ జట్టు తొలి ఓటమిని చవిచూసింది. రెండో రౌండ్‌లో భాగంగా శుక్రవారం డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-0తో పరాజయం పాలైంది. చాంపియన్ జట్టుకు ఇండియా సవాల్ విసిరింది. కానీ డచ్ జట్టు ఎటాకింగ్ గేము ప్రదర్శించింది. 2వ నిమిషంలోనే యిబ్బి జాన్సెన్ ఆ జట్టు తరపున తొలి గోల్ చేసింది. 38వ నిమిషంలో ఫ్రెడెరిక్ మాట్లా మరో గోల్ చేసి నెదర్లాండ్స్‌ను 2-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. పలు పెనాల్టీ కార్నర్లు లభించినా భారత్ అడ్డుకుంది. గోల్ కీపర్ సవిత పూనియా రెండు అద్భుతమైన గోల్స్‌ను నిలువరించింది. ఇండియా టీమ్ చక్కటి డిఫెన్స్‌తో ఆకట్టుకుంది. కానీ దూకుడుగా ఆడలేకపోయింది. గోల్స్ చేయడంలో విఫలమైంది. దీంతో ఆరంభం నుంచి చివరి వరకూ ఒత్తిడిలోనే ఆడిన భారత్ ఒక్క గోల్ కూడా చేయలేక ఓటమి పాలైంది. ఈ పరాజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడనుంది. సెమీస్‌కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్‌లో ఇండియా భారీ విజయం సాధించాల్సిన పరిస్థితి నెలకొంది.



# భారత అథ్లెట్‌పై 10 ఏళ్లు నిషేధం

భారత జావెలిన్ త్రోయర్, ఒలింపియన్ శివ్‌పాల్ సింగ్ కెరీర్ ప్రమాదంలో పడింది. డోపింగ్‌కు పాల్పడినందుకు నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(నాడా) క్రమశిక్షణ ప్యానెల్ అతనిపై వేటు వేసింది. పదేళ్ల నిషేధం విధించింది. అతని శాంపిల్స్‌లో నిషేధిత అనబాలిక్ స్టెరాయిడ్ 'మెథాండినోన్' పాజిటివ్‌గా తేలింది. అతను డోపీగా తేలడం ఇది రెండోసారి. 2021లో డోప్ టెస్టులో పట్టుబడటంతో అతను నాలుగేళ్ల నిషేధానికి గురయ్యాడు. ఆ నిర్ణయాన్ని శివ్‌పాల్ నాడా అప్పీల్ ప్యానెల్ ముందు సవాల్ చేశాడు. తన వాదనతో అప్పీల్ ప్యానెల్ ఏకభవించి నాలుగేళ్ల నిషేధాన్ని సంవత్సరానికి తగ్గించింది. 2023లో అతను తిరిగి పోటీల్లో పాల్గొన్నాడు. రెండోసారి కూడా డోపింగ్‌కు పాల్పడంతో నాడా అతనిపై కఠిన చర్యలు చేపట్టింది.

శివ్‌పాల్ 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం సాధించాడు. 2023 జాతీయ క్రీడల్లోనూ గోల్డ్ మెడల్ గెలిచాడు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ అతను పాల్గొన్నాడు.





# 64 పరుగులకే బంగ్లాదేశ్ ఆలౌట్..!

ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ శనివారం నుంచి మెకేలోని గ్రేట్ బ్యారియర్ రీఫ్ అరేనాలో ప్రారంభమైంది. మ్యాచ్ తొలి రోజే ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ బంతితో విధ్వంసం సృష్టించాడు. వేగం, స్వింగ్, సీమ్‌ను అద్భుతంగా ఉపయోగించిన స్టార్క్.. బంగ్లాదేశ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చాడు. ఫలితంగా బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 64 పరుగులకే ఆలౌట్ అయింది.

**తొలి బంతికే వికెట్..**

మిచెల్ స్టార్క్ బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ తొలి బంతికే శాద్మన్ ఇస్లామ్‌ను ఔట్ చేసి తన ఖాతా తెరిచాడు. ఆ తర్వాత తంజీద్ హసన్, మొమినుల్ హక్, నజ్ముల్ హొస్సేన్ శాంటో, లిటన్ దాస్‌లను కూడా పెవిలియన్‌కు పంపాడు. దీంతో బంగ్లాదేశ్ తొలి ఐదు వికెట్లూ స్టార్క్ ఖాతాలోనే చేరాయి. స్టార్క్ కేవలం 3.4 ఓవర్లలోనే ఐదు వికెట్ల ఘనత సాధించాడు. మొత్తం 10 ఓవర్లు వేసిన అతడు కేవలం 12 పరుగులు ఇచ్చి ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టాడు. ఇది టెస్టు క్రికెట్‌లో స్టార్క్‌కు 19వ ఐదు వికెట్ల ఘనత కావడం విశేషం. అలాగే మొదటి ఓవర్ లో వికెట్ తీయడం 27వ సారి.

**బంగ్లా ఆలౌట్:**

స్టార్క్ ధాటికి తోడు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా బంగ్లాదేశ్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. జోష్ హేజిల్‌వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో బంగ్లాదేశ్ 34 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌట్ అయింది. బంగ్లాదేశ్ తరఫున షోరిఫుల్ ఇస్లామ్ 14 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తైజుల్ ఇస్లామ్ 11 పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు. మెహిదీ హసన్ మిరాజ్ 11 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లంతా తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరారు.మెకే పిచ్ ప్రారంభం నుంచే పేసర్లకు అనుకూలంగా కనిపించింది. ఈ పరిస్థితులను స్టార్క్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. వేగంతో పాటు బంతిని అటు ఇటు కదిలిస్తూ బంగ్లాదేశ్ బ్యాటర్లకు పరీక్ష పెట్టాడు. ముఖ్యంగా ఆఫ్ స్టంప్‌కు వెలుపలికి వెళ్లే బంతులను వదిలేయాల్సిన సమయంలో బ్యాటర్లు అనవసరంగా షాట్లు ఆడి వికెట్లు సమర్పించుకున్నారు. స్టార్క్ కేవలం 42 నిమిషాల్లోనే 5 వికెట్ల మార్కును అందుకున్నాడు. మ్యాచ్ తొలి సెషన్‌లోనే బంగ్లాదేశ్ బ్యాటింగ్ వెన్నుముకను విరిచేశాడు.

**డేల్ స్టెయిన్‌ను దాటిన స్టార్క్:**

ఈ అద్భుత స్పెల్‌తో మిచెల్ స్టార్క్ మరో అరుదైన ఘనతను సాధించాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో దక్షిణాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్‌ను స్టార్క్ అధిగమించాడు. స్టెయిన్ 93 టెస్టుల్లో 439 వికెట్లు సాధించగా.. స్టార్క్ తాజాగా అతడిని దాటి ఈ జాబితాలో పదో స్థానానికి చేరుకున్నాడు. స్టార్క్ బంగ్లాదేశ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చిన తర్వాత ప్యాట్ కమిన్స్ మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. అనుభవజ్ఞుడైన ముష్ఫికర్ రహీమ్‌ను కమిన్స్ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. పిచ్‌పై పడిన తర్వాత లోపలికి వచ్చిన బంతి బ్యాట్, ప్యాడ్ మధ్య గ్యాప్‌లో నుంచి దూసుకెళ్లి మిడిల్ స్టంప్‌ను తాకింది.మెకేలోని పరిస్థితులను ఆస్ట్రేలియా పేసర్లు చాలా త్వరగా అర్థం చేసుకుని సద్వినియోగం చేసుకున్నారు. పిచ్ నుంచి సీమ్, స్వింగ్ రెండూ లభించడంతో ఆస్ట్రేలియా బౌలర్లకు బంగ్లా బ్యాటర్లు సమాధానం చెప్పలేకపోయారు. మరోవైపు బంగ్లాదేశ్ బ్యాటర్లు సహనం కోల్పోయి బయటికి వెళ్తున్న బంతులపై షాట్లు ఆడటం కూడా వారి పతనానికి ప్రధాన కారణమైంది. బంగ్లాదేశ్‌ను కేవలం 64 పరుగులకే ఆలౌట్ చేసిన అనంతరం ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. రెండు ఓవర్లు ముగిసేసరికి ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో బంగ్లాదేశ్‌పై 51 పరుగుల లోటుతో ఆస్ట్రేలియా తొలి రోజు ఆటను కొనసాగిస్తోంది.


# 23 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఇంగ్లాండ్..



ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు పాకిస్థాన్‌ను ఇన్నింగ్స్ , 103 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ బ్యాటర్ల ప్రదర్శన అత్యంత నిరాశాజనకంగా సాగగా, ఇంగ్లాండ్ వేగవంతమైన బౌలర్లు మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా లీడ్స్ పిచ్‌పై ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్లు జొఫ్రా ఆర్చర్, ఒల్లీ రాబిన్సన్, జోష్ టంగ్ అద్భుత ప్రదర్శన చేస్తూ వికెట్ల పండుగ చేసుకున్నారు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి పాకిస్థాన్ సాధించిన మొత్తం 20 వికెట్లను ఇంగ్లాండ్ వేగవంతమైన బౌలర్లే పడగొట్టడం గమనార్హం. ఇలా ఒక మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టులోని మొత్తం 20 వికెట్లను కేవలం ఫాస్ట్ బౌలర్లే పడగొట్టడం 2001 తర్వాత మళ్లీ ఇదే తొలిసారి.గతంలో 2001లో లార్డ్స్ వేదికగా జరిగిన టెస్టులో ఇంగ్లాండ్ పేసర్లు కాడిక్, గఫ్, కార్క్ కలిసి పాకిస్థాన్‌కు చెందిన అన్ని వికెట్లను పడగొట్టి ఇన్నింగ్స్ విజయాన్ని అందించారు. ఆ మ్యాచ్‌లో పాక్ ఇన్నింగ్స్ 9 పరుగుల తేడాతో ఓడిపోగా, ఇప్పుడు లీడ్స్‌లో కూడా అదే పునరావృతమైంది. ఈ ఓటమితో లీడ్స్ మైదానంలో పాకిస్థాన్‌కు వరుసగా రెండోసారి ఇన్నింగ్స్ ఓటమి ఎదురైంది. గతంలో 2018లో కూడా ఇదే మైదానంలో ఇంగ్లాండ్ చేతిలో ఇన్నింగ్స్ , 55 పరుగుల తేడాతో పాక్ పరాజయం పాలైంది.ఈ మ్యాచ్ మూడో రోజు ఇంగ్లాండ్ తన తొలి ఇన్నింగ్స్‌ను 409 పరుగుల వద్ద ముగించి, పాకిస్థాన్‌పై 238 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. ఇంగ్లాండ్ పేసర్ల ధాటికి తాళలేక కేవలం 135 పరుగులకే కుప్పకూలింది. దాంతో మూడో రోజే మ్యాచ్ ముగిసిపోయింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. లీడ్స్ వేదికగా ఇంగ్లాండ్‌కు ఇది ఎంతో ప్రత్యేకమైన రికార్డు. గడిచిన దశాబ్దంలో ఇక్కడ ఆడిన తొమ్మిది టెస్టుల్లో ఇంగ్లాండ్‌కు ఇది ఎనిమిదో విజయం కాగా, అందులో నాలుగు విజయాలు ఆసియా జట్లపైనే ఇన్నింగ్స్ తేడాతో రావడం విశేషం.


# బిజినెస్

## మరింత పెరిగిన బంగారం ధరలు..



అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు పెరుగుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,090గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1520 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,49,500గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1400 మేర పెరిగింది.

## తెలుగు రాష్ట్రాల్లో నేటి గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(శనివారం) ఆగస్టు 16 వ తేది రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**తెలంగాణ**

హైదరాబాద్ : రూ.994.00
వరంగల్ : రూ.1013.00

**ఆంధ్రప్రదేశ్**

విశాఖపట్నం : రూ.950.00
విజయవాడ : రూ.966.50
గుంటూరు : రూ.966.50

# భారత్‌కు బిగ్ బూస్ట్..

భారత ఆర్థిక వ్యవస్థపై కొంత ప్రతికూల ప్రచారం జరుగుతున్న సమయంలో.. భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆగస్టు 14తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 9.905 బిలియన్ డాలర్లు పెరిగి 716.907 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలోనూ నిల్వలు 14.136 బిలియన్ డాలర్లు పెరిగి 707.002 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

**రికార్డు స్థాయికి చేరువలో ఫారెక్స్ నిల్వలు**

భారత్ ఫారెక్స్ నిల్వలు ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేశాయి. ఆ తర్వాత అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ పరిణామాలు, కరెన్సీ మార్కెట్‌లో ఒడిదుడుకుల కారణంగా నిల్వలు తగ్గాయి. తాజా పెరుగుదలతో భారత్ ఫారెక్స్ నిల్వలు మళ్లీ 700 బిలియన్ డాలర్ల మార్కును దాటాయి. ప్రస్తుతం అవి ఫిబ్రవరి రికార్డు స్థాయి కంటే సుమారు 11.6 బిలియన్ డాలర్లు మాత్రమే తక్కువగా ఉన్నాయి.

**విదేశీ కరెన్సీ ఆస్తులే ప్రధాన కారణం**

ఫారెక్స్ నిల్వల్లో అతిపెద్ద భాగమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) తాజా పెరుగుదలలో కీలక పాత్ర పోషించాయి. ఆగస్టు 14తో ముగిసిన వారంలో ఎఫ్‌సీఏ లు 7.225 బిలియన్ డాలర్లు పెరిగి 581.851 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఆస్తుల విలువను అమెరికన్ డాలర్లలో లెక్కిస్తారు. అందువల్ల యూరో, పౌండ్, జపనీస్ యెన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీల విలువల్లో మార్పులు వచ్చినా, డాలర్ పరంగా ఎఫ్‌సీఏ ల విలువలో మార్పు కనిపించవచ్చు.

**బంగారం నిల్వలు కూడా భారీగా పెరిగాయి**

భారత్ గోల్డ్ రిజర్వులు కూడా తాజా వారంలో గణనీయంగా పెరిగాయి. బంగారం నిల్వల విలువ 2.679 బిలియన్ డాలర్లు పెరిగి 111.417 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో మొత్తం ఫారెక్స్ నిల్వలకు మరింత బలం చేకూరింది. మరోవైపు, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ స్వల్పంగా 5 మిలియన్ డాలర్లు తగ్గి 18.74 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి లో భారత్ రిజర్వ్ పొజిషన్ మాత్రం 5 మిలియన్ డాలర్లు పెరిగి 4.899 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

**విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను పెంచే చర్యలు**


దేశంలోకి మరిన్ని విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను ఆకర్షించేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలు కూడా నిల్వల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. అదనపు ఫారెక్స్ ప్రవాహాలను ఆకర్షించే ఉద్దేశంతో ఇటీవల కొన్ని చర్యలను ప్రవేశపెట్టారు. రాయితీ స్వాప్ చర్యల కింద ఆగస్టు 13 నాటికి భారత్‌కు 56.85 బిలియన్ డాలర్లు అందినట్లు సమాచారం.




**భారత్‌కు ఫారెక్స్ నిల్వలు ఎందుకు కీలకం?**

ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు విదేశీ మారకద్రవ్య నిల్వలు కీలకమైన భద్రతా కవచంగా పనిచేస్తాయి. అంతర్జాతీయ మార్కెట్లలో భారీ ఒడిదుడుకులు వచ్చినప్పుడు, దేశ కరెన్సీపై ఒత్తిడి పెరిగినప్పుడు ఆర్‌బీఐ కి పరిస్థితిని నిర్వహించేందుకు ఇవి ఉపయోగపడతాయి. అలాగే విదేశీ చెల్లింపులు, దిగుమతుల అవసరాలు, అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాల సమయంలో ఈ నిల్వలు కీలకంగా ఉంటాయి. ప్రస్తుతం 716.907 బిలియన్ డాలర్ల వద్ద ఉన్న భారత్ ఫారెక్స్ నిల్వలు దేశ బాహ్య ఆర్థిక స్థితి బలంగా ఉందనే సంకేతాన్ని ఇస్తున్నాయి. అయితే భవిష్యత్తులో కరెన్సీ విలువలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు, ముడిచమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు నిల్వలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సెబీ కఠిన చర్యలు..




దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కఠిన చర్యలు చేపట్టింది. నిర్ణీత గడువులోగా తప్పనిసరి రెన్యువల్ ఫీజు చెల్లించడంలో విఫలమైన 15 మంది నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. క్యాపిటల్ మార్కెట్లో ఇన్వెస్టర్ల ప్రయోజనాల రక్షణ, నియంత్రణ నిబంధనల అమలును పకడ్బందీగా కొనసాగించే క్రమంలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.సెబీ (ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్) నిబంధనలు, 2013 ప్రకారం రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు తమ రిజిస్ట్రేషన్ చెల్లుబాటును కొనసాగించేందుకు ప్రతి ఐదేళ్లకోసారి తప్పనిసరిగా పునరుద్ధరణ (రెన్యువల్) ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ 15 మంది సలహాదారులు నిర్దేశిత కాలపరిమితి ముగిసినప్పటికీ ఆ ఫీజును చెల్లించలేదని సెబీ పరిశీలనలో తేలింది. దీంతో నిబంధనల ఉల్లంఘన కింద వారి గుర్తింపును రద్దు చేస్తున్నట్లు సెబీ స్పష్టం చేసింది. ఇకపై వీరు పెట్టుబడి సలహాదారుల సేవలందించేందుకు అర్హులు కారని నియంత్రణ సంస్థ పేర్కొంది.

# 'కాకా' టైటిల్ గ్లింప్స్‌తో పూనకాలు!




తాజాగా విడుదలైన వీడియో గ్లింప్స్ అభిమానుల్లో అంచనాలను భారీగా పెంచేసింది. ఆక్వా రంగంలో 'కె. సత్యం' అనే సూపర్ వైజర్‌గా చిరంజీవి ఎంట్రీ ఇచ్చే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. చెన్నై టీమ్‌తో ఫోన్ మాట్లాడుతూ లోడ్ సకాలంలో చేరుతుందని భరోసా ఇవ్వడం, పండుగ టార్గెట్ పేరుతో సునీల్ అడిగిన లీవ్ తిరస్కరించడం లాంటి సహజమైన సన్నివేశాలతో కథనం మొదలవుతుంది. గెటప్ శ్రీను స్కూటర్ కీస్ విసిరే క్రమంలో అవి అనుకోకుండా నీటిలో పడిపోగా, ఓ కుక్క రిమోట్‌ను తీసుకురావడం.. ఆ రిమోట్ మాగ్నెట్ సాయంతో కీస్‌ను బయటకు తీసే క్రమంలో తుపాకులు బయటకు రావడం ఆసక్తిని రేకెత్తిస్తుంది. అద్దాలు ధరించిన మధ్యవయస్కుడైన 'కె. సత్యం' రూపంలో మెగాస్టార్ హుందాగా కనిపిస్తూనే, ఆ వెంటనే 'కాకా' టైటిల్ రివీల్ కావడం గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. అనంతరం వచ్చే ఫ్లాష్‌బ్యాక్‌లో యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజ్ మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ వైబ్స్‌ను గుర్తుచేస్తోంది. బాబీ మరోసారి చిరంజీవిలోని మాస్ అండ్ క్లాస్ వేరియేషన్లను పర్ఫెక్ట్‌గా ఒడిసిపట్టారు. విజయ్ కార్తీక్ కన్నన్ అందించిన సినిమాటోగ్రఫీ ఆద్యంతం రిచ్‌గా ఉంది. ముఖ్యంగా ఎస్. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అందులో 'గ్యాంగ్ లీడర్' నాటి ఐకానిక్ "గ్యాంగ్ గ్యాంగ్" రీమిక్స్ బీట్ జోడించడం గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది శ్రీఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేథా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తుండగా, సునీల్, గెటప్ శ్రీను ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కోన వెంకట్, చక్రవర్తి రెడ్డి, భాను-నందు రచనా సహకారం అందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నారు.


## అఫీషియల్ పోస్టర్ వైరల్

**నూత్నమైన కథలతో, డిఫరెంట్ పాత్రలతో ప్రేక్షకులను అలరించే టాలీవుడ్ యంగ్ హీరో శ్రీవిష్ణు నుంచి రాబోతున్న సరికొత్త యాక్షన్ కామెడీ చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మరెళ్ల దర్శకత్వంలో, కోనా ఫిలిమ్స్ కార్పోరేషన్, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ పతాకాలపై అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతుంది. గతంలో 'సామజవరగమన', 'ఓం భీమ్ బుష్' వంటి వరుస హిలేరియస్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్లతో ప్రేక్షకులను థియేటర్లలో పొట్టచెక్కలయ్యేలా నవ్వించిన శ్రీవిష్ణు, ఈ చిత్రంలో 1990ల నాటి వింటేజ్ నేపథ్యంతో కూడిన విభిన్నమైన డ్యూయల్ రోల్‌లో మరోసారి నవ్వుల పండగను ఖరారు చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన పలు అప్డేట్స్ ఆకట్టుకోగా.. అక్టోబర్ 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది ఈ చిత్రం. ఈ క్రమంలోనే తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాలో సీనియర్ నటి రాధిక ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. ఈరోజు ఆమె**




**బర్త్‌డే కావడంతో ఆ సందర్భంగా ఈ సినిమాలోని ఆమె పాత్రను రివీల్ చేశారు మేకర్స్. 'అద్భుతమైన నటి, 'సరస్వతమ్మ'గా మనందరికీ సుపరిచితులైన రాధిక గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు.. త్వరలోనే వెండితెరపై 'బాలయ్య ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్'గా ఆమె అద్భుతమైన నటనను చూసేందుకు సిద్ధంగా ఉండండి' అని తెలిపారు.**

## ఆకట్టుకున్న మహిమా మక్వానా




మహిమా మక్వానా భారతదేశానికి చెందిన సినిమా, టెలివిజన్ నటి. 1999 ఆగస్టు 5న జన్మించిన ఆమె 'మిలే జబ్ హమ్ తుమ్', 'బాలికా వధు' వంటి సీరియల్స్‌తో బాలనటిగా టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం 'సప్నే సుహానే లడక్‌పాన్ కే'లో రచన పాత్ర ద్వారా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత మహిమా మక్వానా సినిమాల్లోనూ నటించారు. 2017లో వచ్చిన 'వెంకటాపురం' చిత్రంలో చైత్ర పాత్రలో కనిపించారు. 2019లో 'టేక్ 2' అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించారు. 2021లో 'మోసగాళ్ళు' చిత్రంలో సోహా పాత్రలో, 'అంతిమ్: ది ఫైనల్ ట్రూత్'లో మందన 'మండ' చావడా పాత్రలో కనిపించారు. ప్రస్తుతం 'బాస్ కరో ఆంటీ', 'ప్రాజెక్ట్ లవ్' వంటి ప్రాజెక్టుల్లోనూ భాగమవుతున్నారు. ఇక తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను పోస్ట్ చేసింది. ఇందులో టైట్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో హాట్ లుక్‌లో కనిపిస్తూ ఫొటోలకు స్టిల్స్ ఇచ్చింది. తన ఫ్రంట్, బ్యాక్ లుక్ హైలైట్ అయ్యేలా ఫొటోలకు పోజులిచ్చి ఆకట్టుకుంది. ఈ ఫొటోల్లో మహిమా తన కురులను అందంగా కొప్పులా చుట్టి, కొన్ని వెంట్రుకలు ముఖంపై పడేలా స్టైలిష్‌గా కనిపించింది. మొత్తంగా ఆమె గ్లామరస్ లుక్, స్కిన్ షోతో ఈ ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం మహిమా మక్వానా తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

## తర్వాత నాకు అసలు నిద్ర పట్టలేదు

తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శాన్వి మేఘన ఓ ఫ్యాన్ గర్ల్ అనుభవాన్ని గుర్తు చేసుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నుంచి ఊహించని మెసేజ్ రావడంతో శాన్వి మేఘన ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఇటీవల తాను నటించిన తమిళ సినిమా 'ప్యార్ ప్రేమ కళ్యాణం' ట్రైలర్‌ను అల్లు అర్జున్‌కు పంపగా, ఆయన దానికి ఎంతో సానుకూలంగా స్పందిస్తూ మెసేజ్ చేసినట్లు శాన్వి వెల్లడించారు. ఒక తెలుగు న టి తమిళ చిత్ర పరిశ్రమలో కూడా రాణించడం చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందంటూ బన్నీ ఆమెను అభినందించారని తెలిపారు. అల్లు అర్జున్ ఎంతగానో ప్రోత్సహించే వ్యక్తి అని ప్రశంసిస్తూ శాన్వి ఆ మెసేజ్ చూసిన తర్వాత తనకు రాత్రంతా అసలు నిద్ర పట్టలేదని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఆయన తనకు మెసేజ్ చేయడాన్ని ఒక మరచిపోలేని ఫ్యాన్ గర్ల్ మూమెంట్‌గా చెప్పారు. సూపర్‌స్టార్ రజినీకాంత్‌ను కలవడం అల్లు అర్జున్‌కి ఎలాంటి ప్రత్యేకమైన అనుభూతో, తనకు ఐకాన్ స్టార్ నుంచి మెసేజ్ రావడం కూడా అంతటి గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## స్ట్రీమింగ్ తేదీ ఖరారు




లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు, విభిన్నమైన యాక్షన్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బాలీవుడ్ భామ తాప్సీ పన్ను మరో పవర్‌ఫుల్ రోల్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ చిత్రాన్ని ప్రముఖ రచయిత్రి కనికా థిల్లాన్ తన కథా పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. 'జాయ్‌పుర్రా' అనే ఒక కల్పిత నగరం నేపథ్యంలో సాగే ఈ కథలో తాప్సీ 'బానీ' అనే శక్తివంతమైన తల్లి పాత్రను పోషించారు. తన బిడ్డకు ఎదురయ్యే ఊహించని సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ఆ తల్లి చూపే ధైర్యం, ఆరాటం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్, స్వస్తిక ముఖర్జీ, మీతా వశిష్ఠ్, జతిన్ సర్నా కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలాన్ని చేకూర్చారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డైరెక్ట్ ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా, ఈ విషయాన్ని ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ప్రసారానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాగా, గతంలో వచ్చిన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబా' విజయం తర్వాత నెట్‌ఫ్లిక్స్, కనికా థిల్లాన్, తాప్సీ కాంబినేషన్‌లో వస్తున్న మరొక క్రేజీ ప్రాజెక్ట్ ఇది. ఈ సందర్భంగా కనికా థిల్లాన్ మాట్లాడుతూ.. "పరిస్థితులకు లొంగిపోని ఒక ధైర్యవంతమైన మహిళ కథే గాంధారి. బానీ ప్రయాణం చాలా ఉద్వేగభరితంగా ఉంటుంది. తాప్సీ ఈ పాత్రలో ఒదిగిపోయి నటించింది" అని తెలిపారు. అలాగే నెట్‌ఫ్లిక్స్ ఇండియా ప్రతినిధి రుచికా కపూర్ షేక్ స్పందిస్తూ, ఇది తల్లి ప్రేమను ఒక గొప్ప శక్తిగా చూపించే పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ అని ప్రశంసించారు.



## 'ఇరుముడి' ఓటీటీ పార్ట్నర్ లాక్

మాస్ మహారాజా రవితేజ తాజాగా 'ఇర-ంముడి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమాలో ప్రియ భవాని శంకర్ హీరోయిన్‌గా నటించగా, బేబీ నక్షత్ర రవితేజకు కూతురి పాత్రలో కనిపించింది. నిన్న విడుదలైన ఈ చిత్రానికి మంచి టాక్ రావడంతో అద్భుతమైన ఓపెనింగ్స్ రాబట్టినట్లు తెలుస్తోంది. విడుదలకు ముందే ఈ మూవీ ఓటీటీ పార్టనర్‌ను లాక్ చేసుకున్నట్లు సమాచారం. ఈ సినిమా డిజిటల్ హక్కులను దిగ్గజ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్ని వారాల థియేట్రికల్ రన్ పూర్తయిన తర్వాత ఈ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సమాచారం. సాయికుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించగా, టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్, రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఇప్పటికే ఈ చిత్రానికి హిట్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన రీతిలో దూసుకుపోతున్నట్లు తెలుస్తోంది. చాలా ఏళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ సినిమాతో మాస్ కమ్‌బ్యాక్ ఖాయమని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## పీక్స్‌కు చేరిన హైప్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ఫొటోలు, వీడియోలు తాజాగా సోషల్ మీడియాలో లీకై వైరల్ అవుతున్నాయి. ఈ లీక్స్‌తో సినిమాపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ముఖ్యంగా ఫౌజీలో ఉండబోయే రెండు భారీ యాక్షన్ బ్లాక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఫౌజీ సినిమాలో ఓ భారీ అండర్‌వాటర్ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతున్నట్లు సమాచారం. ఈ ఫైట్ సీన్‌ను దాదాపు 20 రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఈ యాక్షన్ బ్లాక్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనుందని టాక్. సెట్‌కు సంబంధించిన విజువల్స్ కూడా లీక్ కావడంతో అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది. ఇక రెండో యాక్షన్ బ్లాక్‌ను లార్డ్ నరసింహ స్వామి థీమ్ ఆధారంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. అత్యంత పవర్‌ఫుల్‌గా ఉండే ఈ డివోషనల్ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ హై-వోల్టేజ్ యాక్షన్‌తో పాటు ఎమోషన్స్‌తో ఆకట్టుకోనున్నారని సమాచారం. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ ఫైట్‌లో ఏకంగా ముగ్గురు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు కలిసి పనిచేసినట్లు టాక్.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**